ప్రజాశక్తి

మంగళవారం 15 అక్టోబర్ 2024 8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

ఇక కిక్కే కిక్కు...

- ఉమ్మడి కృష్ణాలో మద్యం దుకాణాలకు ప్రశాంతంగా లాటరీ
- విస్తృత పోలీస్ బందోబస్తు మధ్య ముగిసిన ప్రక్రియ
- మచిలీపట్నంలో ఇతర రాష్ట్రాల వారికి రెండు దుకాణాలు
- 16 నుంచి షాపుల ప్రారంభానికి లైసెన్స్ జారీ

ప్రజాశక్తి-కృష్ణా ప్రతినిధి, విజయవాడ

కృష్ణాజిల్లాలో 123, ఎన్‌టిఆర్ జిల్లాలో 113 మద్యం దుకాణాలకు సోమవారం నిర్వహించిన లాటరీ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. లాటరీ ద్వారా దుకాణాలను సొంతం చేసుకున్న వారు మంచి కిక్కులో ఉన్నారు. ఇక మందుబాబులకు కిక్కు ఎక్కించేందుకు సిద్ధమవుతున్నారు. అందులోనూ ప్రభుత్వం రూ.99కే మద్యం సరఫరా చేస్తామని చెబుతుండటంతో మందుబాబులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. సోమవారం ఎన్‌టిఆర్ జిల్లాకు సంబంధించి విజయవాడ గురునానక్‌కాలనీలోని ఎన్‌ఎసి కల్యాణ మండపంలో కలెక్టర్ ఆధ్వర్యంలో, కృష్ణాజిల్లాకు మచిలీపట్నం హిందూ కళాశాలలో జెసి గీతాంజలి శర్మ ఆధ్వర్యంలో మద్యం దుకాణాలకు లాటరీ ప్రక్రియ నిర్వహించారు. ఆయా కేంద్రాల వద్ద వీడియోగ్రఫీ, సిసి టివి కెమెరాల నిఘా మధ్య దుకాణాల వారీగా లాటరీ ప్రక్రియను నిర్వహించారు. ఈ కేంద్రాల వద్ద పోలీసులు విస్తృతస్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉద్రిక్తతలు తలెత్తకుండా లాటరీ కేంద్రాల వద్ద పోలీసుల ఆంక్షలు విధించారు. వంద మీటర్ల పరిధిలోనే వాహనాల రాకపోకలను నిలిపివేశారు. కాలినడకతోనే మద్యం లాటరీ కేంద్రాలకు అనుమతించారు. గెజిట్ ప్రకారం లాటరీ జరిగే షాపు దరఖాస్తు చేసిన వారికి మాత్రమే లోపలికి అనుమతించడంతో ఎటువంటి వివాదాలు లేకుండా లాటరీ ప్రక్రియ ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఎక్సైజ్ స్టేషన్లో వారీగా నియమించిన పరిశీలకులు, ఎక్సైజ్ అధికారులు లాటరీ ప్రక్రియను నిర్వహించారు. గెజిట్ సీరియల్ నంబరు ప్రకారం లాటరీ ద్వారా దరఖాస్తుదారుల సమక్షంలో పూర్తి పారదర్శకంగా షాపులను కేటాయించారు. మచిలీపట్నంలో షాపులు దక్కించుకునేందుకు ఉత్తరప్రదేశ్, కర్ణాటక నుండి దరఖాస్తులు చేయడమే కాకుండా వారికి (మిగతా 2లో)



విజయవాడలో లాటరీలో పాల్గొన్న దరఖాస్తుదారులు, లాటరీ నిర్వహిస్తున్న కలెక్టర్ సృజన

మచిలీపట్నంలో లాటరీ నిర్వహిస్తున్న జెసి గీతాంజలి శర్మ

బందరు-రేపల్లె రైల్వే లైను ఏర్పాటుకు కృషి

- గుడివాడ నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు
- నాగాయలంకలో లంక గ్రామాలను కలుపుతూ రహదారులు
- 'పల్లె పండుగ' కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్

కంకిపాడులో అభివృద్ధి శిలాఫలాకాలను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్

పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలను జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి, కంకిపాడు

ప్రధాన మంత్రి మోడీతో మాట్లాడి కోనసీమ, మచిలీపట్నం, రేపల్లే, బాపట్ల రైల్వే లైను ఏర్పాటుకు కృషి చేస్తానని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి కె.పవన్‌కళ్యాణ్ తెలిపారు. 'పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు' కార్యక్రమం ప్రారంభం సందర్భంగా సోమవారం కంకిపాడులో పలు అభివృద్ధి పనుల శిలాఫలకాలను ఆయన ఆవిష్కరించారు. మండలంలో రూ.95 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పవన్‌కళ్యాణ్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. గుడివాడ అసెంబ్లీ నియోజకవర్గంలోని 45 గ్రామాల్లో నీరు కలుషితమై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆర్‌డబ్ల్యూస్ అధికారులు సమస్య పరిష్కారించాలని సూచించారు. జలజీవన్ మిషన్, అమృత-2 నిధులతో జిల్లాలో శాశ్వతంగా తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కృష్ణానదికి వచ్చిన వరదలకు నాగాయలంక మండలంలో ఎదురుమొండి దీవులు, గొల్లమంద తదితర లంక గ్రామాల్లో ప్రజలు అనుసంధాన రహదారులు లేక ఇబ్బందులు పడ్డారని తన దృష్టికి వచ్చిందన్నారు. లంక గ్రామాలు అనుసంధానిస్తూ రహదారిని నిర్మించడానికి ఉన్న అవకాశాలను అధికారులు పరిశీలించాలన్నారు. రాష్ట్రం అభివృద్ధికి జాతీయ ఉపాధి చట్టం కీలకమైనదని తెలిపారు. ఈ చట్టం ద్వారా పని కావాలని అడిగిన వారికి 15 రోజుల్లో పని కల్పించడం ప్రభుత్వ బాధ్యతని, పని కల్పించలేకుంటే నిరుద్యోగ భృతి ఇవ్వాల్సి వస్తుందన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ఆగస్టులో గ్రామ సభల ద్వారా గుర్తించిన పనులకు ఈ పల్లె పండుగ సందర్భంగా శంకుస్థాపన చేయడం హర్షణీయమన్నారు. పవన్ కళ్యాణ్ నేతృత్వంలో గ్రామాలు అభివృద్ధి పథంలో ముందుకు పోవడం ఖాయమన్నారు. పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ మాట్లాడుతూ ఈ ఐదు సంవత్సరాల్లో గ్రామాల్లో 90 శాతం మౌలిక వసతులు కల్పించి తీరుతామన్నారు. అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 45 వేల కోట్ల రూపాయలతో 30 వేల పనులకు శంకుస్థాపన చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపి వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, వర్ల కుమార్‌రాజా, కాగిత కృష్ణప్రసాద్, పంచాయతీరాజ్ ప్రిన్సిపాల్ సెక్రటరీ శశి భూషణ్ కుమార్, సంచాలకులు కృష్ణతేజ, కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు, ఎంపిపి నెర్సు రాజ్యలక్ష్మీ, నియోజకవర్గ జనసేన సమన్వయకర్త ముప్పా రాజా, సర్పంచ్‌లు బాకీ రమణ, ఎం.విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

విజయవాడలో వర్షం

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- నామమాత్రం చర్యలకే విఎంసి పరిమితం

ప్రజాశక్తి-విజయవాడ

విజయవాడ నగరం తడిచి ముద్దయింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై సాయంత్రం 5.45 గంటల సమయములో తేలకపాటి వర్షం ప్రారంభమై ఆరుగంటల సమయానికి వర్షం ఉధృతమైంది. రాత్రి పొద్దుపోయేంత వరకు కూడా తేలికపాటి జల్లు పడుతూనే ఉంది. ఉదయం 8 గంటల సమయములో కూడా చిరుజల్లులు పడ్డాయి. గత శుక్రవారం నుంచి ప్రతి రోజూ ఏదో ఒక సమయములో అడపాదడపా వర్షం కురుస్తూనే ఉంది. అయితే సోమవారం సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 7.30 గంటల సమయములో కురిసిన కుండపోత వర్షానికి నగరం తడిచి ముద్దయింది. లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరింది. ఆయా ప్రాంతాల నుంచి విజయవాకు పెద్ద ఎత్తున తరలి వచ్చే భవానీల రాకపై ఈ వర్షం ప్రభావం పడింది. విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ సమీప రైల్వే అండర్ బ్రిడ్జీ, అలాగే వన్‌టౌన్ కాళేశ్వరరావు మార్కెట్ సమీప రైల్వే అండర్ బ్రిడ్జీ (ఆర్‌యుబి)లో నీరు చేరింది. రాకపోకలకు కొంత అంతరాయం ఏర్పడింది. సాయంత్రం సమయములో కురిసిన వర్షానికి హాకర్స్ వ్యాపారాలపై తీవ్రమైన ప్రభావం పడింది. భవానీపురం, ఊర్మిళానగర్, కబేళా, విజయా డైరీ మిల్క్, చిట్టినగర్, సింగ్‌నగర్‌లోని వాంబేకాలనీ, ఆర్ఆర్‌నగర్, రాధానగర్, రాజీవ్‌నగర్, ప్రశాంతినగర్, కండ్రిక, ప్రకాష్‌నగర్, డాబాకొట్లు ఏరియా, గవర్నర్‌పేట, సూర్యారావుపేట, సిద్దార్థాఫాలీక్లీనిక్ రోడ్డు, పటమట, గురునానక్ రోడ్డు, కృష్ణలంక, రాణిగారితోట, రామలింగేశ్వర్‌నగర్ తదితర లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు పెద్దఎత్తున చేరి, రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అస్తవ్యస్తంగా తయారయిన డ్రైయినేజీ వ్యవస్థ కారణంగా రహదారులపై నీరు చేరింది. డ్రైయిన్లు పొంగిపొర్లాయి. జన జీవనంకు తీవ్ర అంతరాయం (మిగతా 2లో)

ఎబినేజర్‌కు రైల్వే సంఘాల ఘన నివాళి

ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడ రైల్వే స్టేషన్ సమీపంలో ఇటీవల ఆగంతకుడి చేతిలో పాశవికంగా హత్యకు గురైన లోకోపైలెట్ (ఎల్‌పిఎస్/ బెజవాడ) డి .ఎబినేజర్‌కు రైల్వేలోని పలు కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. ఎబినేజర్‌కు సంతాప కార్యక్రమం సోమవారం రైల్వే స్టేషన్‌లోని ఆరవ ప్లాట్‌పారమ్‌పై జరిగింది. ముందుకు ఎబినేజర్ చిత్రపటానికి నాయకులు పూల మాలలు వేసి ఘన నివాళి అర్పించారు. రైల్వేకు చెందిన పలు కార్మిక సంఘాలు, సిఐటియు నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ఎబినేజర్‌కు ఘన నివాళి అర్పించి, అనంతరం ర్యాలీగా డిఆర్ఎం ఆఫీసుకు వెళ్లి, ఆయనకు వినతిపత్రాన్ని అందజేశారు. రైల్వే ఉద్యోగులకు రక్షణ కల్పించాలని, ఎబినేజర్‌ను హత్యచేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని, చేయి చేయి కలుపుదాం మనల్ని మనం కాపాడుకుందాం అంటూ ర్యాలీలో నాయకులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సంతాప కార్యక్రమంలో ఆల్ ఇండియా ఎస్‌సి, ఎస్‌టి అసోసియేషన్ ప్రెసిడెంట్ కె రమేష్, ఎఐఎల్‌ఆర్‌ఎస్‌ఎ డివిజనల్ సెక్రటరీ కె రామకృష్ణ మాట్లాడుతూ...రైల్వే ఉద్యోగులకు రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. పని భారంతో పాటు ఎవరు ఎటు నుంచి వచ్చి హత్య చేస్తారో తెలియని విధంగా రైల్వే వ్యవస్థ తయారయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికయినా అధికారులు రైల్వే ఉద్యోగులకు తగిన భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అగంతుకుడి చేతిలో హత్యకు గురైన ఎబినేజర్ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సిఆర్‌ఇఎస్ ఎజిఎస్ వై నాగేంద్రబాబు, ఎస్‌సిఆర్‌ఎంయు రన్నింగ్ బ్రాంచ్ సెక్రటరీ ఎం క్రాంతి కుమార్, రైల్వే యూనియన్ (సిఐటియు) రాష్ట్ర నాయకులు వివిఎల్ నర్సింహులు, సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు ఎ వెంకటేశ్వరరావు, జిల్లా నాయకులు ఎ కమల, విజయవాడ పశ్చిమ సిటీ అధ్యక్షులు ఇవి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలన

ప్రజాశక్తి-విజయవాడ: పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా చూసుకోవాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. సోమవారం సాయంత్రం తన పర్యటనలో భాగంగా కష్ణవేణి ఘాట్, పటమట హై స్కూల్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా కృష్ణవేణి ఘాట్‌లో పర్యటించి అక్కడ జరుగుతున్న పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు, భవానీలు విడిచి పెట్టే రెడ్ క్లాత్ ను ఎప్పటికప్పుడు తీసేస్తూ పరిశుద్ధ నిర్వహణ పక్కగా జరిగేటట్టు చూసుకోవాలని అధికారులు ఎప్పటికప్పుడు ప్రేవేక్షిస్తూ ఉండాలని ఆదేశాలించారు.తదుపరి పటమట హైస్కూల్ రోడ్‌లో ఉన్న అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చూసుకోవాలని ప్రజారోగ్య సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు, అలాగే బాత్రూంలో నిర్వహణ, నీటి సరఫరా ఇంజనీరింగ్ తదితర అంశాలు ఇంజనీరింగ్ సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని ఇంజనీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. అన్న క్యాంటీన్ కిచెన్ లో ఉన్న ప్లేట్లు పరిశుభ్రంగా ఉన్నాయా లేవా అని దగ్గరుండి పరిశీలించారు. అన్న క్యాంటీన్ స్పెషల్ ఆఫీసర్లు ఆహారంలో నాణ్యత ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని ఆదేశించారు. ఈ పర్యటనలో అసిస్టెంట్ కలెక్టర్ శుభం నొక్వల్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

ఇక కిక్కే కిక్కు...

లాటరీలో దుకాణాలు దక్కాయి. మచిలీపట్నంలోని ఒకటో నెంబర్ దుకాణం కర్ణాటకు చెందిన మహేశ్ ఎ బాతే, రెండో నెంబర్ దుకాణానికి ఉత్తరప్రదేశ్‌కు చెందిన లోకేశ్ చంద్‌కు దక్కాయి. లాటరీలో వారి పేర్లు రావడంతో ఆనందం వ్యక్తం చేశారు. ఎన్‌టిఆర్ జిల్లా వ్యాప్తంగా 113 మద్యం షాపులకు 5,825 మంది, కృష్ణాజిల్లాలో 123 షాపులకు 2,942 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తులు ద్వారా ఉమ్మడి జిల్లా నుంచి ప్రభుత్వానికి రూ.175.34 కోట్ల ఆదాయం లభించింది. లాటరీలో మద్యం దుకాణం దక్కించుకున్న వ్యాపారి వెంటనే ప్రభుత్వం నిర్ణయించిన టాక్స్‌లో ఒకటి బై ఆరో వంతు చెల్లించాలి. అలాగే ఒకటి బై ఆరోవంతుకు బ్యాంకు గ్యారంటీ చూపించాలి. అనంతరం గెజిట్ ప్రకారం మద్యం షాపు ఏర్పాటు చేసే భవనాన్ని లాటరీ దక్కించుకున్న వ్యక్తి ఎక్సైజ్ అధికారులకు చూపించాలి. నిబంధనల ప్రకారం ఆ భవనం ఉన్నట్లయితే అధికారులు లైసెన్స్ మంజూరు చేస్తారు. లైసెన్స్ మంజూరైన వ్యాపారి ఈనెల 16వ తేదీ నుంచి మద్యం వ్యాపారం ప్రారంభించవచ్చు.

విజయవాడలో వర్షం

ఏర్పడింది. విఎంసి ప్రకటనలకే పరిమితం అయింది. లోతట్టు ప్రాంతాల్లోని నీటిని మోటార్ల ద్వారా తోడించి, శానిటేషన్ మెరుగుదలకు తీసుకోవాల్సిన చర్యలపై విఎంసి అధికారులు, పాలకవర్గం తూతూమంత్రపు చర్య అన్నట్లుగా తయారయింది. నగర కమిషనర్ ఆదేశాలు ఇచ్చినా క్షేత్ర స్థాయిలో పని చేసే నాధుడే కనిపించడం లేదు. దీంతో చిన్నపాటి వర్షానికి సైతం నగరం తడిచిముద్దవుతుంది. డ్రైయినేజీ వ్యవస్థ మెరుగుదలకు, డ్రైయిన్లలో పేరుకుపోయిన షిల్టును పూర్తిస్తాయిలో తొలగించడానికి తీసుకోవాల్సిన చర్యలపై మీనమేషాలు లెక్కిస్తున్నారు. విఎంసిలోని అధికారులు, ఉద్యోగులు, క్షేత్రస్థాయి సిబ్బంది దుర్గామల్లేశ్వరస్వామి దేవ స్థానానికి వచ్చే భవానీల ఏర్పాట్లపై తలమునకలై, నగరానికి సంబంధించిన అంశాల్లో తగిన స్తాయిలో చర్యలు తీసుకోవడం లేదనే విమర్శ నగర ప్రజల నుంచి వ్యక్తం అవుతున్నాయి. అధికార వైసిపి పాలకవర్గం, ప్రధాన ప్రతిపక్షం టిడిపి సోద్యం చూస్తున్నాయి. వైసిపి అధికారంలో ఉన్నా లేనట్లుగానే తయారైంది.

పోలీస్ సిబ్బందికి అభినందనలు

ప్రజాశక్తి-విజయవాడ: ఇంద్రకీలాద్రిపై ఈ నెల 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు ప్రతిష్టాత్మకంగా జరిగిన దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తూ, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, ప్రమాదాలకు అస్కారం లేకుండా అంకిత భావంతో, బాధ్యతగా విధులు నిర్వహించి, విజయవంతంగా ఉత్సవాలు నిర్వహించుటలో తోడ్పాటునందించిన అందరికీ సిపి ఎస్.వి.రాజశేఖరబాబు ప్రత్యేకంగా హదయ పూర్వక అభినందనలు తెలిపారు. సోమవారం పోలీస్ కమాండ్ కంట్రోల్ కార్యాలయంలో ఇతర జిల్లాల నుండి దసరా మహోత్సవాల బందోబస్త్ నిర్వహించడానికి వచ్చిన పోలీస్ అధికారులకు కనకదుర్గ అమ్మవారి శేష వస్త్రం, ఫోటో, లడ్డు ప్రసాదం అందించి సిపి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిపిలు గౌతమిషాలి, ఉదయారాణి, కృష్ణమూర్తి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పేకాటశిబిరంపై దాడి

ప్రజాశకి - భవానీపురం

భవానీపురంలో పేకాటశిబిరంపై పోలీసులు దాడి నిర్వహించారు. సోమవారం పేకాట నిర్వహిస్తున్నారన్న సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్, భవానీపురం పోలీసులు సంయుక్తంగా కలిసి సోమవారం సాయంత్రం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 24 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ. 1,52,000ల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా ఈ జూదాన్ని స్థానికంగా ఉండే ఓ అధికార పార్టీకి చెందిన నేత నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో పూర్ణాహుతి

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఇంద్రకీలాద్రిపై జరిగిన దసరా శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ప్రతి సంవత్సరం జరిగే సాంప్రదాయం ప్రకారం సోమవారం చండీహోమం, పూర్ణాహుతి, అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలను పది రోజులు పాటు నిర్వహించి విజయవంతం చేశారు. ఈ సందర్భంగా సిపి ఎస్.వి.రాజ శేఖర్‌బాబు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు, అనంతరం సిపి మాట్లాడుతూ ఈ ఏడాది దసరా ఉత్సవాలకు ఆరు వేల మంది పోలీసు సిబ్బంది విధుల్లో పాల్గొన్నారని తెలిపారు. దాదాపు 15 లక్షల వరకు యాత్రికులు అమ్మవారి దర్శనం చేసుకున్నారని, అన్ని శాఖల సమన్వయంతో ఉత్సవాలు ఘనంగా జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో డిసిపి గౌతమి షాలి, దేవస్థాన ఈఓ కె.ఎస్.రామారావు, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ గురుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండండి : కమిషనర్

ప్రజాశక్తి-విజయవాడ: భారీ వర్షపు సూచనలు ఉన్నందున నగరపాలక సంస్థ సిబ్బంది మొత్తం అప్రమత్తంగా ఉండి, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని నగర కమిషనర్ ద్యాన చంద్ర అన్నారు. సోమవారం కమిషనర్ 8వ డివిజన్ సిద్ధార్థ నగర్ ప్రాతంలో పర్యటించి క్షేత్రస్థాయిలో డ్రైన్ లను పరిశీలించారు. అక్కడ నుండి వెంటనే జోనల్ కమిషనర్లు, శాఖాధిపతులు, సచివాలయం సిబ్బంది, స్పెషల్ ఆఫీసర్ల తో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు . ఈ టెలి కాన్ఫరెన్సో భారీ వర్షం సూచనలు ఉన్నందున అధికారులందరూ అప్రమత్తంగా ఉంటూ ప్రతి సచివాలయం పరిధిలో ఉన్న ప్రజలందరికీ ఈ సమాచారాన్ని అందచేయడమే కాకుండా ప్రతి సచివాలయం పరిధిలో ఉన్న చాకింగ్ పాయింట్లను గుర్తించి వెంటనే అక్కడున్న ప్లాస్టిక్కు, ఫ్లోటింగ్ గార్బేజ్, డీజిల్టింగ్ చేసి వర్షపు నీటి ప్రవాహానికి ఎటువంటి ఆటంకం లేకుండా సులువుగా వెలిపోయేటట్టు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.వర్షం పడక ముందే, వర్షపు నీరు నిలువ ఉండే చోట్ల ను గుర్తించి డీజిల్టింగ్ ప్రక్రియను ను మొదలుపెట్టి, ఇప్పుడు వర్షం పడిన నీరు నిల్వ ఉండే ప్రదేశాలలో కూడా నీటి నిల్వలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.వర్షం పడిన వెంటనే సిబ్బంది మొత్తం అప్రమత్తంగా ఉంటూ ఫీల్డ్ లో వర్షపు నీటి నిలువలను ఎక్కడ నిలవకుండా చూసుకోవాలని, అధికారులు జోనల్ కమిషనర్లు వారి వారి ప్రాంతాలలో దగ్గరుండి పర్యవేక్షణ చేయాలని అన్నారు.ఎదుటి భారీ వర్షం వచ్చినా వర్షాన్ని మనం ఆపలేము, కానీ వర్షం వల్ల ప్రజలు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకునే ప్రక్రియను వెంటనే మొదలుపెట్టి ప్రజలను ఇబ్బంది కలగకుండా చూసుకునే టట్టు మనం చేయగలం కాబట్టి అందరూ అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని కమిషనర్ అన్నారు.బుడమేరు వరదలలో, దసరా ఉత్సవాలలో సిబ్బంది పనితీరును మెచ్చుకున్నారు. ఇప్పుడు భారీ వర్షం సూచనలు ఉన్నాయి కాబట్టి భారీ వర్షాలు పడే అవకాశాలు ఉంటాయి కాబట్టి వర్షాలు పడినప్పుడు కూడా సిబ్బంది అంతే అప్రమత్తంగా ఉంటూ ప్రజలను సురక్షితంగా చూసుకోవాలని, ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉండేటట్టు చర్యలు తీసుకోవాలన్నారు.

CHANGE OF NAME

I, Shaik Mukbul S/o. Shaik Mahabub Jani (old name) D.No.18-446, Edgah Road, Darussalam Madina Masjid, Siddiq Nagar,Kanuru, vijayawada (Rural)-520007. My Name has been changed to **Shaik Maqbool S/o. Shaik Mahabub Jani (New name)** .Hereafter my name is known as **Shaik Maqbool S/o. Shaik Mahabub Jani (New name).**

మహారాజశ్రీ గన్నవరం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P. No. 9/2024 in (FDP) I.A. No. 391/2016 in O.S. No. 15/2014

కోగంటి శివరామవరప్రసాద్, తండ్రి లేటు నాగభూషణం, హిందు, వయసు 70 సం॥లు డోర్ నెం. 42-2/1-132, DRWA 266, దేవినగర్, విజయవాడ – DHR

వర్సెస్

JDR3: కోగంటి నాగ చంద్రశేఖరరావు, తండ్రి లేటు నాగభూషణం, హిందు 60 సం॥లు C/o. జాస్తి ప్రభాకరరావు, అన్నవరం, నూజివీడు మండలం, కృష్ణాజిల్లా.
JDR5: దాసరి వెంకట సత్యనారాయణమ్మ, భర్త వెంకటేశ్వరచౌదరి, హిందు, 64 సం॥లు రిటైర్డ్ ఆర్.టి.సి డ్రైవర్, C/o డి.వెంకటాద్రి, మోటర్‌సైకిల్ మెకానిక్ షెడ్, ఆర్.టి.సి. డిపో ప్రక్కన, గుడివాడ, కృష్ణాజిల్లా.
JDR6: యలవర్తి లలితకుమారి, భర్త శ్రీకృష్ణ, హిందు, వయస్సు 55 సం॥లు, మార్చురీ బాక్సు సప్లయ్ ఆఫీసు, స్మశానం ఎదురు, మాచవరండౌన్, విజయవాడ. ... JDRs

వాయిదా తేది: 07-11-2024

పై నెంబరు E.P. 9/2024 లో మీకు కోర్టు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను నోటీసులు పంపగా సదరు నోటీసులు తీసుకొనకుండా కాలయాపన చేసినందున సదరు నోటీసులు అమలుకుగాను కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము తెలియపరచడమైనది కావున పై తేదిన ఉదయం 10-30.ని॥లకు మీరు స్వయముగా గాని, ప్లీడరు గారు ద్వారా గాని హాజరై ఆక్షేపణలున్నచో తెలియపరచుకోవలెను. లేనిచో పరోక్షమున తీర్మానించబడునని తెలియపరచడమైనది.
వాయిదా తేది: 07-11-2024.

ఇట్లు
జాస్తి తాతారావు,
DHR తరపు న్యాయవాది,
గన్నవరం

వృద్ధుల సంక్షేమం పట్ల శ్రద్ధ వహించాలి : కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్ డికె బాలాజీ

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : వృద్ధుల సంక్షేమం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ జిల్లా స్థాయి వద్ధుల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వద్ధుల కమిటీలోని వయోవృద్ధుల సమస్య లను, అభిప్రాయాలను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ వయోవృద్ధులైన తల్లి దండ్రుల సంరక్షణ బాధ్యత వారి పిల్లలపై ఉందన్నారు. ఇందుకు సంబంధించి 270 కేసులు రాగా అందులో 257 కేసులు పరిష్కా రమయ్యాయన్నారు. మచిలీపట్నం ఆర్డిఓ పరిధిలో పెండింగ్లో ఉన్న కేసులు వేగవంతంగా పరిష్కరిం చాలన్నారు. వద్ధులైన తల్లిదండ్రులు కలిగిన పిల్లలు నెలవారి భత్యం వారి ఖాతాలో జమ చేస్తారనే విషయంపై ఎలాంటి నమ్మకం లేకపోతే ఆర్డీవోల పరిధిలో ఒక బ్యాంకు ఖాతాను తెరచి అందులో భత్యం జమ అయ్యేలా చూడాలన్నారు. అందులో నుండి వయోవద్ధులకు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రతి సోమవారం కలెక్టరేట్లో జరిగే మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వయోవద్ధుల కోసం ప్రాధాన్యత నిచ్చి ప్రత్యేక ప్రవేశ మార్గం ద్వారా వారి అర్జీలను స్వీకరించేందుకు ఏర్పాటు చేయాలని కలెక్టరేట్ ఏవో కు సూచించారు. ఈ నెల 18వ తేదీన జరగనున్న బ్యాంకర్ల సమావేశంలో రెవిన్యూ మార్ట్ గేజ్ పథకం గురించి చర్చిస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా సీనియర్ సివిల్ జడ్జి కెవి రామకష్ణయ్య, అదనపు ఎస్పీ ఎస్విడి ప్రసాద్, జిల్లా వయోవద్ధులు దివ్యాంగుల శాఖ సహాయ సంచాలకులు కామరాజు, డిసిహెచ్ఎస్ డాక్టర్ శ్రావణ్ కుమార్, డిఎంహెచ్వో డాక్టర్ ఐసిడిఎస్ పిడి సువర్ణ, జడ్పిసిఓ కన్నమ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధిత కుటుంబానికి సాయం

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లికి చెందిన కిడ్నీ బాధితుడు అబ్దుల్ సుభానికి ఐవీఎం ట్రస్ట్ ప్రెసిడెంట్ డాక్టర్ వేములపల్లి సురేష్ అండగా నిలిచారు. సోమవారం మండల పరిధి పురిటిగడ్డలోని ఐవీఎం ట్రస్ట్ కార్యాలయంలో సుభాని పిల్లలు నజ్రీన్, సుహాన్ విద్యాభ్యాసం కోసం రూ.ఇరవై వేలు ఆర్థిక సహాయం అందచేశారు. సుభానికి రెండు కిడ్నీలు దెబ్బతిన్న నేపథ్యంలో అతనికి కిడ్నీ మార్పిడి ఆపరేషన్ సమయంలో తనవంతు ఆర్థిక సహాయం అందిస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఐవీఎం ట్రస్ట్ డైరెక్టర్ వేములపల్లి రోజా, ప్రముఖ న్యాయవాది తుటారం ప్రసాద్, పట్నాల రాజా, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

సౌర విద్యుత్‌తో డబ్బు ఆదా

ప్రజాశక్తి-ఉయ్యూరు : గృహ అవసరాలకు సౌర విద్యుత్ ప్యానల్స్ అమర్చుకుని ఆర్థిక ప్రయోజనం పొందవచ్చని ఏపీసీపీడీసీఎల్ డి.కృష్ణనాయక్ అన్నారు. ప్రధాన మంత్రి సూర్య ఘర్ మఫ్టీ బి జిలీ యోజన పథకంలో భాగంగా గృహఅవసరాలకు సౌర విద్యుత్ ప్యానల్స్ అమర్చుకొనుట ద్వారా కలిగే ప్రయోజనాలపై కేసీపీ ఆడిటోరియంలో సోమవారం సబ్డివిజన్ పరిధిలో ఉయ్యూరు, తోట్లవల్లూరు మండలాల ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇళ్లపై సోలార్ ప్యానల్స్ అమర్చుకుంటే కరెంటు బిల్లులు తగ్గుతాయన్నారు. ఈపథకం ద్వారా ప్రభుత్వం నుంచి సబ్సిడీ పొందవచ్చని వివరించారు. ఈసందర్భంగా ఈపథకం పై పలువురు సందేహాలు నివత్తిచేసి రిజిస్ట్రేషన్ ప్రారంభించారు. డిప్యూటీ ఈఈ హేమకుమాంర్, ఏఈలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డి.కృష్ణనాయక్

కళాకారులను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి-ఉయ్యూరు : సంస్కృతి సంప్రదాయాలు, కళలకు నిలయమైన మన సమాజంలో కళాకారులను ప్రోత్సహించడం కళలను గౌరవించడమవుతుందని ఉయ్యూరు మాజీ చైర్మన్ జంపాన పూర్ణచంద్రరావు అన్నారు. దేవి శరన్నరాత్రి ఉత్సవాల్లో ఉయ్యూరు పరిసర గ్రామాల్లో అమ్మవారిని వివిధ దేవతామూర్తులుగా కొన్ని సంవత్సరాలుగా అలంకరిస్తూ భక్తుల మన్ననలు పొందిన శ్రీజగదాంబ సమేత సోమేవ్వరస్వామి ఆలయ అర్చకుడు మామిళ్లపల్లి సోమేశ్వరరావును పూర్ణచంద్రరావు ఘనంగా సత్కరించారు. కళలు అంతరించి పోతున్న తరుణంలో సైతం అమ్మవారి అలంకారాలు చేయడంలో నిష్ణాతులుగా నిలిచిన సోమేశ్వరరావు అభినంద నీయులని కొనియాడారు. ఆలయ అసిస్టెంట్ శ్రీనివాసరావు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

అర్చకుడు మామిళ్లపల్లి సోమేశ్వరరావును సత్కరిస్తున్న ఉయ్యూరు మాజీ చైర్మన్ జంపాన పూర్ణచంద్రరావు

మాట్లాడుతున్న సతీష్‌రెడ్డి

విద్యార్థులు వినూత్న ఆలోచనలతో ముందుకెళ్లాలి

ప్రజాశక్తి-ఉంగుటూరు : సాంకేతిక రంగాలలో వినూత్న ఆలోచనలతో ముందుకు వచ్చేలా యువతను ప్రోత్సహించడం అనివార్యమైన బాధ్యత అని ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా చైర్మన్ డాక్టర్ జి సతీష్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని తేలప్రోలు ఉషా రామ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలకు వచ్చిన సతీష్‌రెడ్డి మీడియాతో మాట్లా డుతూ సాంకేతిక రంగాలలో వినూత్న ఆలోచనలతో ముందుకు వచ్చేలా యువతను ప్రోత్సహించడం ఈ రోజుల్లో అత్యవసరమని అన్నారు. తయారీ, రూపకల్పన ఆవిష్కరణలు, స్టార్టప్ ప్రోత్సాహాన్ని అందించడానికి వీలు కల్పించే వాతావరణాన్ని సష్టించడానికి భారత ప్రభుత్వం విద్యా వ్యవస్థలో అనేక సంస్కరణలను తీసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఐడిఎం కల్నల్ పిఎస్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జివికె ఎస్ వి ప్రసాద్, ఆర్ అండ్ డి, ఇన్నోవేషన్ సెల్ డీన్ డాక్టర్ జి సాగర్, కళాశాల చైర్మన్ సుంకర రామబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

గుల్లలమోదలో క్షిపణి కేంద్రం ఏర్పాటుపై హర్షం

ప్రజాశక్తి-అవనిగడ్డ : నాగాయలంక మండలం గొల్లల బాధలో నూతన క్షిపణి కేంద్రం ఏర్పాటుకు కేంద్ర రక్షణ వ్యవహారాల కమిటీ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ఆనందదా యకమని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం అవనిగడ్డ లోని తమ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ క్షిపణి పరీక్షలకు అత్యంత అనుకూలమైన ప్రదేశంగా నాగాయలంక మండలం గొల్లల బోధ ప్రాంతాన్ని కేంద్ర ప్రభుత్వం శాటిలైట్ ద్వారా ఎంపిక చేయగా గత ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి హయాంలో భూములు కేటాయించారని తెలిపారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రహరీ నిర్మించి పర్యావరణ అనుమతులు సాధించారన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సారథ్యంలోని హై లెవెల్ సెక్యూరిటీ కమిటీ నిర్ణయం తీసుకొని గుల్లల మోదక్షి పణి పరీక్ష కేంద్రం మంజూరు చేయడం ద్వారా అవనిగడ్డ నియోజకవర్గం ఇచ్చిందన్నారు. ఈ పరీక్షా కేంద్రం గుల్లల మోద లో ఏర్పాటు చేయడం ద్వారా అవనిగడ్డ నియోజకవర్గంతో పాటు జిల్లాలో అనేక అభివద్ధి కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

అవనిగడ్డలో ఎడతెరిపి లేని వర్షం

ప్రజాశక్తి-అవనగడ్డ : బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి ఏర్పడడంతో అవనిగడ్డలో గత రాత్రి నుండి ఎడతెరిపిలేని వర్షం కురుస్తోంది. దీంతో పల్లపు ప్రాంతాలన్నీ జలమయంఅయ్యాయి. బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ద్రోణి వాయుగుండంగా మారి తుఫానుగా మారవచ్చునని దీనితో భారీ వర్షాలు కూడా కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు రైతులను తీవ్ర ఆందోళనలకు గురిచేస్తున్నాయి. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు పంట పొలాలన్నీ నీటమునగగా తిరిగి నాట్లు వేసుకొని రైతులు కాస్త ఊపిరి పీల్చుకుంటున్న తరుణంలో తిరిగి మరల తుఫాను భారీ వర్షాల వార్తతో తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. మరో మూడు నాలుగు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వార్త మరింత ఆందోళనకు గురిచేస్తుంది. ముఖ్యంగా డ్రైనేజీలు పూర్తిస్థాయిలో నడవకపోవడంతో ఎక్కడికక్కడ వర్షపునీరు నిలిచిపోయి పల్లపు ప్రాంతాలు నీటి ముంపుకు గురవుతుండగా మరోవైపు పంట పొలాలు కూడా ముంపుకు గురవుతున్నాయి.

ఉల్లిపాలెంలో గృహంపై విరిగి పడిన తాడిచెట్టు

ప్రజాశక్తి-కోడూరు : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన కారణంగా ఈదురు గాలులతో కురిసిన భారీ వర్షానికి తాడిచెట్టు విరిగి నివాసగృహంపై పడిన సంఘటన కోడూరు మండల పరిధిలోని ఉల్లిపాలెం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఓడుగు పున్నారావు నివాస గృహం పక్కన ఉన్న తాడిచెట్టు సోమవారం ఒక్కసారిగా విరిగి ఇంటి పై పడింది. ఈ ఘటనలో అదష్టవశాత్తు ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఇంటిపై రేకులు పూర్తిగా ధ్వంసం అయ్యాయి.

కోడూరు మండలంలో ఇంటిపై పడిన తాటిచెట్టు

వెంకటరెడ్డి భౌతిక కాయం పై పూలమాలలు వేసిన సిపిఎం నాయకులు

సిపిఎం అభిమాని మృతి

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం రాయనగర్‌కు చెందిన సిపిఎం అభిమాని భక్తుల వెంకటరెడ్డి (67) సోమవారం గుండెపోటుతో మరణించారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సిపిఎం మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు, పార్టీ నాయకులు పటాన్ సర్దార్, మహేష్, మిరప నాగేశ్వరరావు, గుండె మెడ ఉదయ భాస్కరరావు, అనుమోలు వెంకటేశ్వరరావు, మోటమర్రి నాగ బ్రహ్మాచారి, ఇతర పెద్దలు, టిడిపి, వైసిపి నాయకులు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

శ్రీకాకుళేశ్వరుడిని దర్శించుకున్న సినీనటి అన్నపూర్ణ

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండలం శ్రీకాకుళంలో ఉన్న శ్రీకాకుళేశ్వర స్వామిని సీనియర్ సినినటి అన్నపూర్ణ సోమవారం దర్శిం చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందించారు.

అమరవీరులకు నివాళి

ప్రజాశక్తి-మొవ్వ : మొవ్వమండలం కాజ గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో కాజ శాఖ మహాసభ సోమవారం సీనియర్ సభ్యులు బత్తిన రామచంద్రరావు అధ్యక్షతన జరిగినది. తొలుత అమరజీవి మర్రి నాగిరెడ్డి ఇంటి వద్ద పార్టీ జెండాను సీనియర్ సభ్యులు దగాని రాయప్ప ఆవిష్కరించి అమరవీరులకు నివాళు లర్పించారు. కాజ, పద్దరాయుడుతోట గ్రామాల సిపిఎం సంయుక్త కార్యదర్శిగా కొడాలి కరుణాకర్ రావుని ఎన్నుకున్నారు. ఈ మహాసభలో కాజ,పద్దరాయుడుతోట గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని తీర్మానించారు. ఈ మహాసభకు పార్టీ జిల్లా నాయకులు శీలం నారాయణరావు, గ్రామ పార్టీ సభ్యులు మురహరి, తదితరులు హాజరయ్యారు.

మున్సిపల్ కమిషనర్‌నకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

మున్సిపల్ కమిషనర్‌కు అభినందనలు

ప్రజాశక్తి-గుడివాడ : గుడివాడ కమిషనర్‌గా పదవి బాధ్యతలు స్వీకరించిన బి.శ్రీనివాసరావును సోమవారం మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ అసోసియేషన్ నాయకులు మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ షాపింగ్ అసోసి యేషన్ అధ్యక్షుడు యోగ మిత్ర శ్రీనివాస్, కార్యదర్శి కొత్త సుబ్బారావు. సభ్యులు సయ్యద్ గఫార్, సభ్యులు పాల్గొన్నారు.

భవానీలతో కిటకిటలాడిన క్యూలైన్లు

దుర్గమ్మ దర్శనానికి క్యూ లైనులో ఉన్న భవానీలు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఇంద్రకీలాద్రిపై ఈ నెల 3వ తేదీ నుండి 12వ తేదీ వరకూ దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా నిర్వహించిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో దుర్గమ్మ మాల ధరించిన భవానీలు మాలా విరమిడి కోసం దుర్గమ్మ చెంతకు చేరుకునేందుకు పెద్ద సంఖ్యలో సోమవారం కూడా తరలివచ్చారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుండి మాలాధారణ చేసిన భవానీలు దుర్గమ్మ దర్శనం కోసం ఇంద్రకీలాద్రికి పోటెత్తారు. దుర్గగుడి పరిసర ప్రాంతాలు మొత్తం ఎర్రసంద్రంగా మారిపోయాయి. రైల్వేస్టేషన్, బస్టాండ్‌లు యాత్రికులు, భవానీలతో ఫుల్‌గా నిండిపోయారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుండి అధిక సంఖ్యలో భవానీలు, యాత్రికులు 12, 13 తేదీలు శని, ఆదివారాలు సెలవు రోజులు కావటంతో దుర్గమ్మ దర్శనానికి పిల్లా పాపలతో తరలి రాగా, పండుగ పూర్తి రెండు రోజుల తరువాత సోమవారం కూడా పెద్ద సంఖ్యలో భవానీలు విజయవాడ దుర్గమ్మ దర్శనానికి పోటెత్తారు.

అన్నీ క్యూ లైన్లు ఉచిత దర్శనాలే...

వివిఐపి, విఐపి అనే తేడా లేకుండా ఇంద్రకీలాద్రి చేరుకుని దుర్గమ్మను దర్శించుకునేందుకు అన్ని క్యూ లైన్లు ఉచిత దర్శనాలు కల్పించారు. రూ.500, రూ.300 టిక్కెట్లు అమ్మకాలు నిలిపివేయటంతో పున్నమి, భవానీ ఘాట్ల నుంచి బస్సులు తిరగలేదు. ఆఖరికి దేవాలయానికి చెందిన బస్సులను కూడా పోలీసులు అనుమతించలేదు.

కనకదుర్గానగర్‌లో అందుబాటులో 12 లడ్డు ప్రసాదం కౌంటర్లు

వినాయకుని గుడి వద్ద నుండి కొండపైకి చేరుకునే యాత్రికులు, భవానీలు దుర్గమ్మను దర్శించుకుని అటునుంచి మెట్ల మార్గం గుండా కనకదుర్గానగర్ వైపుకు వెళ్ళాల్సి ఉంటుంది. కనకదుర్గానగర్‌లో దుర్గమ్మ దర్శనం కోసం వచ్చే వారికి అన్నదానం కూడా ఏర్పాటు చేశారు. అదే ప్రాంతంలో భవానీలు, యాత్రికుల కోసం ఏర్పాటుచేసిన లడ్డూ ప్రసాదం కౌంటర్లలో ఒక్కొక్కరికి 4 లడ్డూలను ఇస్తున్నారు.

ఎపిజెన్ కో కాంట్రాక్టు కార్మికుల పోస్టుకార్డు ఉద్యమం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ముఖ్యమంత్రి దృష్టికి విద్యుత్ కార్మికుల సమస్యలు తీసుకువెళ్లేందుకు సోమవారం పోస్ట్ కార్డు పంపే కార్యక్రమం ఎన్‌టిటిపిఎస్ పాత గేటు వద్ద చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు సిహెచ్.చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యుత్ సంస్థల్లో కాంట్రాక్ట్ కార్మికుల దశాబ్దాలు తరబడి పని చేస్తున్నారన్నారు. కార్మికుల సమస్యల మీద విద్యుత్ యాజమాన్యంతో చర్చిస్తే ఈ సమస్య ప్రభుత్వ పరిధిలోనిది కాబట్టి ప్రభుత్వానికి రాస్తామని సమాధానం ఇస్తుందన్నారు. ప్రభుత్వ పెద్దలను కలిస్తే విద్యుత్తు సమస్యల మేనేజ్ మెంట్‌తో మాట్లాడతామంటూ కార్మికుల సమస్యల పరిష్కారంలో జరుగుతున్న కాలయాపనపైపెపి జెన్ కో కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల మీద దశల వారి ఉద్యమకార్యాచరణ కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ వర్కర్స్ యూనియన్ ఎఫ్ 23 06 నిర్ణయించిందన్నారు. అందులో భాగంగా ఈ నెల 18 19 తేదీలలో నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరు కావాలని నిర్ణయించినట్లు తెలిపారు. మెయిన్ డిమాండ్స్ పిఆర్ సి 16 నెలల ఎరియర్స్ వెంటనే రిలీజ్ చేయాలని, ప్రస్తుతం కాంట్రాక్ట్ కార్మికులు చేస్తున్న గ్రేడ్లను మార్పు చేయాలని గతంలో మాదిరిగా సర్వీస్ ఇన్సెంటివ్ పునర్దరించాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్‌కె షెన్ష్‌వల్లి, టి.తంబి కుమార్, ఎ.నాగేశ్వరరావు, కె.సుబ్బారావు కవ తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న లెక్చరర్లు

కాంట్రాక్టు లెక్చరర్లను క్రమబద్ధీకరించాలి

ప్రజాశక్తి - తిరువూరు : ఒప్పంద ప్రాతిపదికన రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లను క్రమబద్ధీకరించాలని తిరువూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు నిరసన తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు కళాశాలలో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకులు పసుపు రిబ్బన్లు ధరించి సోమవారం విధులకు హాజరయ్యారు. గత ప్రభుత్వం కాంట్రాక్ట్ లెక్చరర్స్ అందరిని రెగ్యులర్ చేస్తామని జీవో నెంబర్ 114 జారీ చేసినప్పటికీ తదను గుణంగా చర్యలు చేపట్టలేదని కాంట్రాక్ట్ లెక్చరర్స్ ఆరోపించారు. కనీసం ప్రస్తుతం అధికారంలో ఉన్న ఎన్డిఏ కూటమి ప్రభుత్వం అయినా ఒప్పంద అధ్యాపకుల గోడు పట్టించుకుని, తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కాంట్రాక్టు లెక్చరర్ల క్రమబద్ధీకరణపై ప్రస్తుత ప్రభుత్వం కూడా తాత్సారం చేస్తే ఈనెల 14వ తేదీ నుంచి 19 వరకు దశల వారిగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

అన్నప్రసాదం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : దసరా మహోత్సవాల ముగింపు సందర్భంగా చిట్టినగర్‌లోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో సోమవారం వేలాది మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం కమిటీ అధ్యక్షులు లింగిపిల్లి అప్పారావు, కార్యదర్శి మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్ళా శ్రీనివాసరావు (పి.సి.), గౌరవాధ్యక్షులు బెవర సూర్యనారాయణ మాట్లాడుతూ దసరా మహోత్సవాలను తమ కమిటీ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించడం పట్ల సంతోషంగా ఉందని అన్నారు. అలాగే అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో కూడా యాత్రికులు విచ్చేసి అన్న ప్రసాదాన్ని స్వీకరించడం సంతోషంగా ఉందని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ ఉపాధ్యక్షులు మరుపిళ్ల సత్యనారాయణ, బెవర శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శులు పొట్నూరి దుర్గాప్రసాద్, శీరం వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

టిఎస్‌పి రోడ్డు ర్యాంపు నిర్మాణ పనులు పూర్తిచేయాలి

50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు

సంతకాల సేకరణలో పాల్గొన్న కార్పొరేటర్ బోయి సత్యబాబు, రాజు తదితరులు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : గత ఏడాదిగా రోడ్డు ర్యాంపు నిర్మాణ పనులు జరగకుండా మధ్యలో ఆపేయడం వల్ల కొండ ప్రాంత ప్రజలు జారిపడి గాయాల పాలవుతూ ప్రమాదాలకు గురవుతున్నా పట్టించుకోకపోవడం దారుణమని సిపిఎం ఫ్లోర్ లీడర్, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయ సత్యబాబు అన్నారు. ఈ విషయమై పలుమార్లు కమిషనర్ అధికారులకు తెలియపరిచినా ఇసుక కొరత కారణం చెప్పి బిల్లులు మంజూరు కావట్లేదని కారణంతో పూర్తిగా గాలికి వదిలేశారని అన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం సిపిఎం పశ్చిమ సిటీ ఆధ్వర్యంలో కార్పొరేటర్ బోయి సత్యబాబు నిలిచిపోయిన ర్యాంపు నిర్మాణం వెంటనే పూర్తిచేయాలని కోరుతూ సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ తాము చేపట్టిన సంతకాల సేకరణను మున్సిపల్ కమిషనర్‌కి అందజేస్తామన్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే ఆపివేసిన పనులను ప్రారంభించుటకు సకాలంలో పూర్తి చేసేందుకు నాణ్యమైన పని జరిగేందుకు చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ప్రజల ఆందోళన చేపట్టవలసి వస్తుందని హెచ్చరించారు. కొండ ప్రాంతంలో రిటైనింగ్ వాల్ మంజూరైన పనులు జరగడం లేదని ప్రమాదకరంగా ఉన్న రిటైనింగ్ వాళ్ళు మంజూరు చేయడం లేదని ఇంకా రోడ్ల నిర్మాణ పనులు కూడా పూర్తి చేయాలని మహంతిపురం ముంపు నివారణ చర్యలు చేపట్టాలి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.రాజు పాల్గొన్నారు.

చైన్ స్నాచర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పెద్దవరం సచివాలయంలో పోస్టర్లు అంటించిన పోలీసులు

ప్రజాశక్తి - తిరువూరు : ఇటీవల ఒంటరిగా వెళ్తున్న మహిళలను టార్గెట్ చేసి చోరీలకు పాల్పడుతున్న చైన్ స్నాచర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని తిరువూరు ఎస్ఐ సత్యనారాయణ తెలి పారు. పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, మండలంలోని పెద్దవరం, మునుకుళ్ళ గ్రామాల్లోని గ్రామ సచివాలయాల్లో సోమవారం చైన్‌స్నాచర్ల ఆగడాలపై అవగాహన కల్పిస్తూ పోలీసులు పోస్టర్లు ప్రదర్శించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పల్సర్ బైక్‌పై వస్తున్న ఇద్దరు వ్యక్తులు ఇళ్ల వద్ద ఒంటరిగా ఉండే మహిళలను, రోడ్డుపై వెళ్తున్న మహిళలను టార్గెట్ చేసి మెడలోని బంగారు ఆభరణాలు, గొలుసులు దొంగలిస్తున్నారని తెలిపారు. విలువైన వస్తువులు ధరించి ఒంటరిగా రోడ్లపై సంచరించొద్దని, ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. చైన్ స్నాచర్లపై అవగాహన కలిగి ఉండటమే కాకుండా విస్తృతంగా ప్రచారం కల్పించాలని ఎస్ఐ సూచించారు.

టివి టెక్నీషియన్లకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - నందిగామ : గత నెలలో భారీ వరద ముంపుకు గురైన టివి టెక్నీషియన్ల కుటుంబాలకు సోమవారం ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో రెండో విడతలో భాగంగా ఎలక్ట్రానిక్ అసోసియేషన్ ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రెసిడెంట్ ఎంఎ పాషా ఆర్థిక సాయం చేశారు. మొత్తం 21మంది టివి టెక్నీషియన్లకు ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున ఆర్థిక సహాయం అందజేసి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. **జగ్గయ్యపేట :** పట్టణంలోని మిట్టగూడెం చెందిన జనసేన పార్టీ కార్యకర్త గుంజ దుర్గారావు (జి ఎం ఎస్) కుమారుడు గుంజ రవి గణేష్ స్కూల్ ఫీజు నిమిత్తం శ్రీకృష్ణ దేవరాయ కాపు సేవా సమితి ప్రధాన కార్యదర్శి ముత్యాల శేషు 25వేల రూ ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా సోమవారం మాజీ ప్రభుత్వ విప్, జనసేన పార్టీ నాయకులు సామినేని ఉదయభాను నివాసంలో జరిగిన కార్యక్రమంలో ముత్యాల శేషు అందజేసిన చెక్కును ఉదయభాను చేతుల మీదగా దుర్గ కుటుంబ సభ్యులకు అందజేశారు.

నూతన ఆవిష్కరణలపై పట్టు సాధించాలి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విద్యార్థులు తమతమ రంగాల్లో వస్తున్న నూతన ఆవిష్కరణలపై పట్టు సాధించాలని సీనియర్ డేటాబేస్ ఎనలిస్ట్ అండ్ ఇంజనీర్ జి రామకిరణ్‌గుప్తా అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ ఆధ్వర్యంలో డేటాబేస్ రంగంలో వచ్చిన నూతన ఆవిష్కరణలు - సమస్యలు అంశంపై వర్క్‌షాప్‌ను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా హాజరైన జి.రామకిరణ్‌గుప్తా మాట్లాడుతూ డేటాబేస్ రంగంలో చాలా నూతన అంశాలు ముందుకు వస్తున్నాయన్నారు. అందులో భాగంగా మంగోడిబి అట్లాస్ సాఫ్ట్‌వేర్‌తో వ్యాపార రంగంలో నిర్ణయాలు తీసుకోవటానికి అవకాశముంటుందన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ విద్యార్థులకు వారి వారి రంగాల్లో వస్తున్న మార్పులపై అవగాహన కలిగించేందుకు ఈ విధమైన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పిఎల్ రమేష్, పీజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేష్, ఎంపీఏ విభాగాధిపతి డాక్టర్ వీటీ రామపవన్‌కుమార్ పాల్గొన్నారు.

జనసేనలో చేరిక

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : జగ్గయ్య పేట నియోజకవర్గంలోని సుప్రసిద్ధ పెనుగంచిప్రోలు శ్రీ తిరుపతమ్మ తల్లి దేవస్థానం చైర్మన్ జంగాల శ్రీనివాసరావు (వాసు), జగ్గయ్యపేట మండలంలోని తిరుమలగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ కొమరగిరి భరద్వాజ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి మాజీ ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను సమక్షంలో జనసేనలో చేరారు.

సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - విస్సన్నపేట : సిసి రోడ్ల నిర్మాణానికి తిరువూరు ఎంఎల్ఎ కొలికపూడి శ్రీనివాసరావు సోమవారం విస్సన్నపేటలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి గ్రామంలో సిసి రోడ్లు నిర్మించాలని నిర్ణయించడం మంచి తరుణమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పిల్లి మెరిసి వనజాక్షి ఎంపిడిఒ గ్రామ సర్పంచులు మండల కూటమి నాయకులు కార్యకర్తలు మండల అధికారులు పాల్గొన్నారు.

20న వైద్య శిబిరం

ప్రజాశక్తి - తిరువూరు : జెవివి తిరువూరు శాఖ, జిబిఆర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 20న బిపి, షుగర్, ఫిట్స్ రోగులకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు జెవివి ప్రతినిధులు ఎం.నాగేంద్ర ప్రసాద్, ఎం.హరికృష్ణ, కె.పాపారావు తెలిపారు. తిరువూరు నాగార్జున స్కూల్‌లో ప్రతి రెండు నెలలకోసారి 3వ ఆది వారం నిర్వహించే బిపి, షుగర్, ఫిట్స్ రోగుల రెగ్యులర్ మెడికల్ క్యాంపుకు రోగులు కనీసం 2, 3 రోజుల ముందుగా షుగర్, బిపి పరీక్షలు చేయించుకుని రిపోర్టులతో రావాలని తెలిపారు. ఈ క్యాంప్‌లో రెండు నెలలకు సరిపడ అన్ని రకాల మందులు రూ.200కు మాత్రమే ఇస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 9491545653, 9492487133, 9441056670 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

ట్రాఫిక్ వలయంలో గన్నవరం

- నిత్యం బారులు తీరుతున్న వాహనాలు
- ట్రాఫిక్ క్రమబద్ధీకరించేందుకు పూర్తి స్థాయిలో లేని సిబ్బంది
- డేంజరస్ జోన్లలో తరచూ రోడ్డు ప్రమాదాలు
- ఉదయం, సాయంత్రం సమయాల్లో తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలంలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న పలు గ్రామాల ప్రజలను నిత్యం ట్రాఫిక్ సమస్య పట్టి పీడిస్తోంది. ఎయిర్పోర్ట్, కేసరపల్లి, కొత్తపేట, వెంకటేశ్వర థియేటర్ సెంటర్, గాంధీ బొమ్మ సెంటర్, బస్టాండ్ సెంటర్, దావాజీగూడెం తదితర ఏరియాలు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్నాయి. దీంతో ఏ చిన్నపాటి అవసరం వచ్చినా ఆయా గ్రామాల వారు జాతీయ రహదారి పైకి రావాల్సిందే. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ రహ దారిపై నిత్యం ట్రాఫిక్ స్తంభిస్తోంది. గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాల మీదుగా నిత్యం జాతీయ రహదారిపై వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో పలు సంద ర్భాల్లో గంటల కొద్దీ వాహనాలు నిలిచిపోతు న్నాయి. జాతీయ రహదారిని ఆనుకుని పలు పాఠశాలలు, వ్యాపార సంస్థలు ఉన్నాయి. దీంతో ఉదయం, సాయంత్రం రహదారిపై తీవ్ర రద్దీ ఏర్పడుతోంది. ట్రాఫిక్ చక్రబంధంలో ఇరుక్కుని నిర్ణీత సమయానికి గమ్యస్థానం చేరుకోలేకపోతున్నామని ప్రయాణికులు, విద్యార్థులు పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ట్రాఫిక్ ను నియంత్రించేందుకు ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ పోలీసులు లేకపోవడంతో పాఠశాల విద్యార్థులు, వద్ధులు రహదారి పైకి రావాలంటేనే భయపడుతున్నారు.

నిత్యం వాహనాలు బారులు...

పలు గ్రామాల్లో ముఖ్యంగా పలు కూడళ్లలో నిత్యం ట్రాఫిక్ స్తంభిస్తుంది. గాంధీ బొమ్మ సెంటర్, వెంకటేశ్వరా థియేటర్ సెంటర్, కొత్తపేట సెంటర్ కూడళ్లలో నిత్యం వాహనాలు బారులు తీరుతున్నా పట్టించుకునే పరిస్థితి లేదు. విజయవాడ నుంచి నుంచి వచ్చే భారీ వాహనాలు, ఇతర వాహనాలు జాతీయ రహదారి మీదుగా గన్నవరం మీదుగా హనుమాన్ జంక్షన్ చేరుకుంటాయి. అక్కడి నుంచి అవసరాన్ని గుడివాడ, నూజివీడు, ఏలూరు మీదుగా వెళతాయి. ఈ సమయంలో రహదారి సెంటర్లో భారీగా ట్రాఫిక్ నిలిచిపోతోంది.

ప్రత్యామ్నాయ రహదారిని పట్టించుకోరే?

ప్రత్యామ్నాయ బైపాస్ రహదారిని పట్టించుకునే నాధుడే కరువయ్యారని పలు గ్రామాల వారు ఆరో పిస్తున్నారు. డేంజరస్ ఏరియాలుగా పిలువబడే ఈ ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు నిత్యకత్యమ య్యాయి. ఒక్క గన్నవరంలోనే ఇటీవల సుమారు 5 మందికి పైగా మత్యువాత పడ్డారు. పలువురు క్షతగాత్రులయ్యారు. గాంధీ బొమ్మ సెంటర్ వద్ద నిత్యం ట్రాఫిక్ ఏరేంజ్లో నిలుస్తుందో ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. వెంకటేశ్వర థియేటర్ సెంటర్లో ట్రాఫిక్ విషయంలో మరో డేంజర్ జోన్ గా మారింది.బైపాస్ వెళ్లే ప్రత్యామ్నాయ రహదారిని పట్టిం చుకుంటే భవిష్యత్లో భారీ వాహనాలకు అతి సులువైన మార్గం అవుతుంది. ఈ రహదారిలో ఉన్న కొద్దిపాటి ఆక్రమణలు తొలగించి అభివద్ధి పరిస్తే జాతీయ రహదారిపైకి వాహనాలు ఎక్కా ల్సిన అవసరం ఉండదు. గన్నవరం ఎయిర్పోర్టు నుంచి వచ్చే ఎమ్మెల్యేలు, మంత్రుల కాన్వాయ్లు కూడా ఈ ప్రత్యామ్నాయ మార్గంలో ఎవరికీ ఇబ్బం ది లేకుండా వెళ్లవచ్చు. దీంతో చాలా వరకూ ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టవచ్చు. నిత్య వేధిస్తున్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి అధికా రులు చర్యలు తీసుకోవాలని, ప్రత్యామ్నాం. రహదారి అంశాన్ని దష్టిలో పెట్టుకోవాలని ప్రయాణికులు, పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

16 వరకు ఈ-క్రాప్ అభ్యంతరాలు స్వీకరణ

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండలంలో ఖరీఫ్ - 2024 పంటకాలంలో 13 రైతు సేవా కేంద్రాల పరిధిలో 19389 ఎకరాల్లో సాగు చేయబడిన పంటలు, రైతుల వివరాలను ఈ-క్రాఫ్లో నమోదు చేయటం జరిగిందని ఘంటసాల మండల వ్యవసాయ శాఖ అధికారి కె.మురళీకష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు సేవా కేంద్రం పరిధిలో సాగు చేయబడిన పంటలు, రైతుల యొక్క సమాచారం తాలూకా ముసాయిదా జాబితాలను ఆయా రైతు సేవా కేంద్రం నోటీసు బోర్డులలో ప్రదర్శించటం జరిగిందన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉన్న యెడల రైతులు ఈ నెల 16వ తేదీలోపు అర్జీలు అందజేస్తే పరిశీలించి చివరి సారిగా మార్పులు చేసి అనంతరం 18వ తేదీన తుది జాబితాలను ప్రదర్శించటం జరుగుతుందన్నారు. తుది జాబితా ఆధారంగా రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ జరుగుతుందని ఆయన తెలిపారు.

ఇరువురు విద్యార్థులకు మెడికల్ సీట్లు

రాజ్కుమార్

సాయిలోహిత్

ప్రజాశక్తి-గన్నవరం : నీట్లో ఉత్తమ ర్యాంకులు సాధించడంతో పాటు మెడికల్ సీట్లు ఇరువురు విద్యార్థులు పొందడం పట్ల వి.కె.ఆర్ కాలేజ్ ప్రిన్సిపాల్ డి. శ్రీనివాసరావు సంతో షం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో ఇంటర్ బైపీసి పూర్తిచేసిన జె - రాజ్కుమార్ నీట్ లో 94, 175 ర్యాంక్ పొందాడని చెప్పారు. గుంటూరు మెడికల్ కాలేజిలో సీటు సాధించాడని తెలిపారు. అదేవిధంగా టి . సాయి లోహిత్ ర్యాంక్ 16,882 సాధించినట్లు చెప్పారు. ఆంధ్ర మెడికల్ సైన్స్ లో సీటు సాధించినట్లు వివరించారు. పట్టుదలతో మెడికల్ సీట్లు సాధించిన విద్యార్థులకు అభినం దన తెలిపారు. కళాశాల యజమాన్య కమిటీ అధ్యక్షులు వెంకట్ మొటపర్తి, కార్యదర్శి జిఎల్ఎస్ఎన్ ప్రసాద్ ప్రత్యేకంగా విద్యార్థులకు అభినందనలు చెప్పారు.

అర్జీల పరిష్కారానికి దృష్టి సారించాలి : డిఆర్ఓ

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు క్షేత్రస్థాయిలో తప్పనిసరిగా విచారణ నిర్వహించి అర్జీదారుని సమస్యలు విని, పరిష్కరించాలని డిఆర్ఓ కే. చంద్రశేఖరరావు అన్నారు. సోమవారం కలెక్టరేట్లో మీటింగ్ హాల్లో డిఆర్ఓ, కె ఆర్ ఆర్ సి ప్రత్యేక ఉప కలెక్టర్ శ్రీదేవి 'మీకోసం' నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. జిల్లాలో అర్జీల పరిష్కారంపై సమీక్షించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ అధికారులు ప్రజల నుండి వచ్చిన అర్జీలు గడుపులోగా పరిష్కరించాలన్నారు. వచ్చిన అర్జీలు క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించాలని అర్జీ దారులతో మాట్లాడాలని, వారి సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కరించాలన్నారు. కోర్టు కేసులకు సంబంధించి కోర్టు ధిక్కరణ కేసులలో సత్వరమే ఒకాలత్తులు ఫైల్ చేయాలన్నారు. ఈ సమావేశంలో డియంహెచ్ ఓ డాక్టర్ జె గీతాబాయి, డీఈవో తహెరా సుల్తానా, హౌసింగ్ పీడీ ఎస్ వెంకట్రావు, ఉద్యాన శాఖ అధికారి జే.జ్యోతి, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ పద్మావతి, సిపిఓ గణేష్ కష్ణ తదితరులు పాల్గొన్నారు .

అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

నకిలీ విత్తనాలు పంట పొలాలను పరిశీలిస్తున్న ఇన్చార్జీ ఏవో నూరిన్నీసా

నకిలీ మందులు అమ్మితే చర్యలు

- ఇన్చార్జి ఎఒ నూరిన్నీసా
- 'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి-పెడన : రైతులకు నాసిరకం పురుగు మందులు, నకిలీ విత్తనాలు అమ్మితే సహించేది లేదని ఇంచార్జ్ ఏవో నూరిన్నీసా సోమవారం పేర్కొన్నారు. శుక్రవారం 'నకిలీ విత్తనాలతో రైతులు గగ్గోలు' అన్న శీర్షికన ప్రజాశక్తిలో వెలువడిన సంగతి పాఠకులకు విధితమే. దీనిపై స్పందించిన సోమవారం ఆయా పంట పొలాలను పరిశీలించారు. రైతుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె రైతులతో మాట్లాడుతూ సదరు డీలర్ పై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే చట్టరీత్య చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో వీటిని కొనుగోలు చేసిన రసీదులు, సంచులు కూడా తమకు ఇస్తే వాటిని పరిశీలించి లైసెన్సులను రద్దు చేసేందుకు వెనకాడ బోమని చెప్పారు. ఇలాంటి సంఘటనలు పునరావతం కాకుండా చర్యలు చేపడతామన్నారు. ఇందుకు వ్యవసాయ శాఖ నుంచి రైతులకు ఎప్పుడు పూర్తి సహకారం ఉంటుందని ఆమె వెల్లడించారు. వీటిపై స్పందించిన రైతులు బిల్లులతో ఫిర్యాదు చేస్తామని ఆమెకు వివరించారు.

పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల పరిశీలన

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు పాల శీతలీకరణ కేంద్రం పరిధిలోని మండలంలో శేరిదగ్గుమిల్లి, విన్నకోట, అంగలూరు పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘాలను కష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ యూనియన్ పాడి రైతులకు అందించే ధర వ్యత్యాసం, కళ్యాణమస్తు,క్షీరభంధు, ప్రతిభా, ఆక్సిడెంట్ కేర్ ట్రస్ట్ పథకాల గురించి, అలాగే పాడి పశువులకు అందించే పశు భీమా, డీ వార్మింగ్ ,పశు దాణా,కాల్షియం, మినరల్ మిక్సర్ వాడటం వలన కలిగే ప్రయోజనాలను పాడి రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కష్ణా మిల్క్ యూనియన్ పాలక వర్గ సభ్యులు వల్లభనేని భాస్కర కుటుంబ వెంకట సుబ్బారావు, గుడ్లవల్లేరు పాల శీతల కేంద్రం మేనేజర్ తోట సత్యనారాయణ, సంఘ అధ్యక్షులు బుబత్తిన కాశేశ్వరమ్మ , సాయన హరిప్రసాద్ పాల్గొన్నారు.

వరద బాధితులకు పరిహారం అందించాలని వినతి

ప్రజాశక్తి-ఉంగుటూరు : ఇటీవల సంభవించిన వరదల కారణంగా పంట నష్టపోయిన రైతులకు,నీట మునిగిన ఇళ్ళు బాధితులకు తక్షణమే పరిహారం చెల్లించాలని సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం ఉంగుటూరు తహశీల్దార్ జె విమలా కుమారికి వెల్దిపాడు లంకపల్లి ముక్క పాడు , కొయ్యగూరపాడు, ఆముదాలపల్లి ,ఎలుకపాడు గ్రామాలకు సంబంధించిన బాధితులు పెద్ద సంఖ్యలో తాసిల్దార్ కార్యాలయానికి చేరుకుని సామూహికంగా వినతిపత్రం అందజేశారు. దీనితో పాటుగా వరద కారణంగా పాడైపోయిన మోటార్లుకు , ఆయిల్ ఇంజిన్ లకు రిపేర్లకు విజయవాడ నగరంలో ఇచ్చిన విధంగా నష్టపరిహారాన్ని కూడా ఇప్పించాలని బాధితులు కోరారు. ఇళు ్ళ నీటమునిగిన బాధితులకు బియ్యం, పంచదార, కందిపప్పు, తదితర నిత్యావసర సరుకులు ఇంకా కొంత మంది కి అందించలేదని వారికి కూడా తక్షణమే వాటిని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టీవి లక్ష్మణస్వామి, సిపిఎం మండల కార్యదర్శి అజ్మీర వెంకటేశ్వరరావు బాధితులు విష్ణు, ప్రసాద్, జయరాజు, మేరీ కుమారి, ఇమ్మానుయోలు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కేవీకే ప్రధాన శాస్త్రవేత్తగా సుధారాణి

సుధారాణిని అభినందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్తగా డాక్టర్ డి సుధారాణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సుధారాణి ఉయ్యూరు చెరకు పరిశోధన స్థానంలో సీనియర్ శాస్త్రవేత్తగా విధులు నిర్వర్తించి బదిలీపై ఘంటసాలకు వచ్చారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ కేవీకే శాస్త్రవేత్తలు సమన్వయంతో రైతులకు పలు సూచనలు అందజేస్తామన్నారు. రైతులకు మేలైన విత్తనాలు అందించడంతో పాటు సస్యరక్షణ, సస్య పోషణ, ఆధునిక వ్యవసాయ పద్ధతులను గూర్చి వివరిస్తామన్నారు. చేపల, పెంపకం ,కోళ్ళు, మేకలు పెంపకం తేనెటీగలు పెంపకం, పుట్టగొడుగుల పెంపకం, తదితర అంశాలపై విడతలు వారీగా నిర్వహించే శిక్షణలను రైతులు వినియోగించుకోవాలన్నారు. సుధారాణిని కేవీకే శాస్త్రవేత్తలు వి మంజువాణి, బి నవీన్ జీ కష్ణవేణి ఎం వెంకటలక్ష్మి, సుబ్బారెడ్డి, సాయిలు అభినందించారు.

పోస్టర్, ఫ్లెక్సీ ఫ్రీ సిటీగా జగ్గయ్యపేట

ఎంఎల్ఎ శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణాన్ని పోస్టల్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దేందుకు ఎంఎల్ఏ శ్రీరాం రాజగోపాల్ సోమవారం పట్టణ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ రాజగోపాల్ మాట్లాడుతూ జగ్గయ్యపేట పట్టణంలో ఫ్లెక్సీలు, పోస్టర్లు ఎక్కువ అవ్వడం వల్ల పట్టణ ప్రజలు ప్రయాణాల్లో ఇబ్బంది పడుతున్నారని, వాహనదారులకు దారి కూడా కనపడని విధంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారని, అది మాత్రమే కాకుండా పట్టణమంతా ఎక్కడపడితే అక్కడ పోస్టల్స్ ఉండటంతో పట్టణ రోడ్లపై ప్రయాణం కష్టమవుతుందని, అందుకునూ మున్సిపల్ మంత్రి నారాయణ నెల్లూరు పట్టణాన్ని పోస్టర్ ఫ్రీగా మారుస్తున్నారని, జగ్గయ్యపేట పట్టణాన్ని ఫ్లెక్సీ రహితంగా మార్చేందుకు కృషి చేస్తున్నామని, దానిలో భాగంగా జగ్గయ్యపేట పట్టణంలో ఈ మహోన్నతమైన కార్యక్రమాన్ని చేపట్టామని, పట్టణంలో ఏ రకమైన పోస్టర్, ఫ్లెక్సీ ఉన్న తీసివేయడం జరుగుతుందని, ఇప్పటికే వారం రోజుల క్రితం తొలగింపు ప్రక్రియపై ప్రచారం చేసినట్లు తెలిపారు. మంగళవారం నుంచి ప్రతి పోస్టర్‌ను తొలగిస్తామని, కేవలం దీపావళి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఏర్పాటు చేసిన పోస్టర్లు మాత్రమే ఉంచుతున్నామని దీపావళి తర్వాత రోజు అవి

ఫ్లెక్సీ తొలగిస్తున్న ఎంఎల్ఏ రాజగోపాల్

కూడా తీసివేస్తారని తెలిపారు. పట్టణ ప్రజలు, రాజకీయ నాయకులు అందరూ మునిసిపాలిటీ వారికి సహకరించాలని తద్వారా పట్టణ ప్రజలకు మేలు జరుగుతుందని కోరారు. ఈ సందర్భంగా తమ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు కట్టిన ఫ్లెక్సీలను ఎంఎల్ఏ రాజగోపాల్ స్వయంగా తొలగించారు. ఇకపై ఎవరైనా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయదల్చుకుంటే ముందుగానే మున్సిపాలిటీ వారికి తెలియజేయాలని ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు రెండు మూడు రోజులు కంటే ఎక్కువ రోజులు ఉంచకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, మున్సిపల్ కమిషనర్ రామ్మోహన్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిసి రోడ్ల పనులు ప్రారంభం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సోమవారం షేర్ మహమ్మద్ పేట గ్రామంలో రూ.70 లక్షలతో సిసి రోడ్స్ కమ్ డ్రైన్స్, గౌరవరం గ్రామంలో 50 లక్షలతో సిసి రోడ్డు కమ్ డ్రైయిన్స్‌ను గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ నిధులు 5 కోట్లతో గ్రామపంచాయతీల్లో నిర్మాణానికి ప్రభుత్వం పనులు పండుగకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఎంఎల్ఏ శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) పనులు ప్రారంభించారు. ఈ పనులు మొత్తం సంక్రాంతి పండుగ లోపు పూర్తి చేయాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ యుద్ధ ప్రాతిపదికన పనులు మంజూరు చేస్తూ ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట మండల టిడిపి అధ్యక్షులు కట్టా వెంకట నరసింహారావు, షేర్ మహమ్మద్ పేట, గౌరవరం గ్రామాల నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ పటిమతోనే ప్రగతి సాధ్యం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: సమాఖ్య పాలన పారదర్శకంగా ఉండాలని, నాయకత్వ పటిమతోనే ప్రగతి సాధ్యమవుతుందని స్టేట్ రిసోర్స్ పర్సన్, జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యులు, సామాజికవేత్త కర్లపాటి

మహిళలతో మాట్లాడుతున్న కర్లపాటి

వెంకట శ్రీనివాసరావు అన్నారు. ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నిక కాబడిన జగ్గయ్యపేట పట్టణ సమాఖ్య కార్యవర్గ సభ్యులు కర్లపాటిని తన కార్యాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కర్లపాటి మాట్లాడుతూ సమాఖ్య పాలనలో పారదర్శకత, జవాబుదారితనం ఉండాలని, ప్రభుత్వ లక్ష్యాలు పట్ల అవగాహన పెంపొందించుకొని పట్టణ మహిళల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని నూతన పాలకవర్గానికి ఆయన సూచించారు. పదవి కాలం భవిష్యత్ తరాలకు ఆదర్శంగా తీర్చిదిద్దుకోవాలని హితవు పలికారు. మహిళా సంఘాల అభివృద్ధికి అవసరమైన నిర్మాణాత్మక సహకారం తమ సంస్థ అందిస్తుందని హామీ ఇచ్చారు. మహిళల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు నజీమున్, కార్యదర్శి గోనెల పద్మ, కోశాధికారి పద్మ, టిఎల్ఎఫ్ రిసోర్స్ పర్సన్ లావణ్య, ట్రస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డును బాగుచేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : షేర్ మహమ్మద్ పేట గ్రామ సమీపంలోని జగ్గయ్యపేట వెళ్లే రోడ్డులో గల పెద్ద మోరి వద్ద ఏర్పడ్డ గోతులను తక్షణమే పూడ్చాలని సిపిఎం మండల, పట్టణ కార్యదర్శి సోమోజు నాగమణి డిమాండ్ చేశారు. మండలంలోని షేర్ మహ్మద్ పేట గ్రామ సమీపంలోని పెద్ద మోరి వద్ద రోడ్డు పక్కన ఏర్పడ్డ గుంటలను సిపిఎం పార్టీ బృందం సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వరదల వల్ల కలిగిన పంట, ఆస్తి, భూమి కోతకు గురైన నష్టాలను చెల్లించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. వరద నష్టం చెల్లించటం అనేది మొక్కుబడిగా చేసిందన్నారు. గ్రామ సమీపంలో ఏర్పడ్డ గుంటల వల్ల వాహనదారులకు, పాదాచారులకు, పశువులకు ప్రమాదంగా తయారైందన్నారు. పల్లె పండుగ కార్యక్రమానికి షేర్ మహమ్మద్ పేట గ్రామానికి విచ్చేసిన స్థానిక ఎంఎల్ఏ శ్రీరామ్ రాజగోపాల్‌ను సిపిఎం బందం కలిసింది. ఈ సందర్భంగా అడ్డరోడ్డుకు మరమ్మతులు చేయటంతో పాటు గ్రామంలో గల కుక్కలు, కోతులు సమస్య పరిష్కరించాలని, రామచంద్రుని పేట వెళ్లే రోడ్‌లో ఎర్ర కాలువపై గల సప్టా

సమస్యను ఎంఎల్ఏకు వివరిస్తున్న సిపిఎం నాయకులు

తక్కువ ఎత్తులో ఉండటం వల్ల వర్షం వచ్చినపుడు వర్షపు నీరు సప్టా పైకి ప్రవహించడం వల్ల ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు రాజగోపాల్ వాటిని పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కోట కృష్ణ కాకనబోయిన లింగారావు, షేక్‌గౌస్ మియా, కోట రవికుమార్, షేక్ బడేమియా, బాలు, కోటా రవికుమార్, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సిసి రోడ్లతో పాటు డ్రైనేజీ వ్యవస్థ తప్పనిసరి : సిపిఎం

ప్రజాశక్తి - విస్సన్నపేట : సిసి రోడ్లతో పాటు డ్రైనేజీ వ్యవస్థ కూడా తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి విస్సంపల్లి నాగరాజు మాట్లాడుతూ మండలంలో ఐదు కోట్ల రూపాయలతో సిసి రోడ్లు అభివృద్ధి మండలానికి మంచి శుభ పరిణామమే కానీ సిసి రోడ్లు ఏర్పాటు చేసే క్రమంలో డ్రైనేజీ నీరు వెళ్లడానికి అనుకూలంగా కనీసం సిమెంట్ తూరలు ఏర్పాటు చేయడం గతంలో మరిచారని ఇప్పుడు ప్రారంభించే సిసి రోడ్లకైనా డ్రైనేజీ వాటర్ వెళ్లడానికి అనుకూలంగా తూరలు ఏర్పాటు చేసి వర్షపునీరు, రోజు వారి గ్రామస్తుల వాడకపు నీరు నిల్వ ఉండకుండా చేయాలని సిపిఎం విస్సన్నపేట మండలం కమిటీ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండల అధికారులకు, ప్రజా ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. డ్రైనేజీ సదుపాయం లేకుండా సిసి రోడ్లు నిర్మించిన వాటర్ వెళ్లడానికి అవకాశం లేక డ్రైనేజీ నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు అధికంగా రావడం వల్ల ఇతర జబ్బులకు ప్రజలు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా తిరువూరు ఎంఎల్ఏ కొలికపూడి శ్రీనివాసరావు శంకుస్థాపన చేసి ప్రారంభించే సిసి రోడ్ల నిర్మాణం డ్రైనేజీ నీరు వెళ్లడానికి అనుకూలంగా ఉండేలా ఏర్పాటు చేయాలని నాగరాజు అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు ధనలక్ష్మి, రామకృష్ణ, కిషోర్ పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు

సిపిఎం కార్యదర్శిగా ధనమ్మ

ప్రజాశక్తి - పెనుగంచిప్రోలు : పెనుగంచిప్రోలు గ్రామ సిపిఎం కార్యదర్శిగా గుండబోయిన ధనమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. టెంపుల్ శాఖ పదో మహాసభ తురకా కొండలు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ధనమ్మను ఏకగ్రీవంగా సభ్యులు ఎన్నుకోనున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా

సెక్రటేరియట్ సభ్యులు కోట కళ్యాణ్, మండల నాయకులు ధారా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. పెనుగంచిప్రోలు గ్రామ ఆఫీస్ ఏరియా సిపిఎం కార్యదర్శిగా పోలేపల్లి తిరుపతమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - విజయవాడ : వచ్చే ఏడాది జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రులు తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని వైసిపి సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు సూచించారు. కొత్త వారితో పాటు పాతవారు కూడా నమోదు చేసుకోవాలని. సంబంధిత విద్యార్హత సర్టిఫికెట్, ఫోటో, ఆధార్ కార్డుతో ఫారం-18 ద్వారా ఆన్ లైన్లో సులభంగా ఓటు నమోదు చేసుకోవచ్చన్నారు. అలాగే పట్టభద్రుల సౌకర్యార్థం ఆంధ్రప్రభ కాలనీలోని జనహిత సదనములో ఓ హెల్ప్ డెస్క్ ను ఏర్పాటు చేసినట్లు మల్లాది విష్ణు ఓ ప్రకటనలో తెలిపారు. ఫోన్ నెంబర్ 8919826398 ను కూడా అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ఎ.కొండూరు : దసరా పండగ సెలవు రోజుల్లో ఎ.కొండూరు మండలం కంభంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఉన్న పది పెద్ద చెట్లను, ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు అక్రమంగా నరికి వేశారని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కుమార్ నాయక్ ఆరోపించారు. సోమవారం హైస్కూల్ ప్రాంగణంలో నరికి వేసిన చెట్లను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాల హెచ్ఎం, విద్యాశాఖాధి కారుల ప్రమేయం లేకుండా, పాఠశాల ఆవరణలోని చెట్లను నరికించడం సరైనది కాదని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాల ఆవరణలో ఉన్న చెట్టు కొన్ని సంవత్సరాలుగా విద్యార్థులకు స్టడీ అవర్లో నీడనిస్తున్నాయని, మళ్లీ ఆ చెట్టు పెరగాలంటే 10 సంవత్సరాలకు పైగా పడుతుందని అలాంటి చెట్లను నరికిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కుమార్ నాయక్ జిల్లా విద్యాశాఖాధికారులకు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - కంచికచర్ల : రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన చెవిటికల్లు మాజీ సర్పంచ్ కోగంటి విష్ణువర్ధన్ కుటుంబ సభ్యులను నందిగామ ఎంఎల్ఏ తంగిరాల సౌమ్య, మాజీ మంత్రి దేవినేని ఉమా పరామర్శించారు. కోగంటి భౌతికకాయానికి ఆమె పూల మాల వేసి నివాళులర్పించారు. టిడిపిలో క్రియాశీలక నాయకుడైన కోగంటి మృతి పార్టీకి, గ్రామానికి తీరని లోటన్నారు. శోకసముద్రంలో ఉన్న కోగంటి భార్య, కుమార్తె, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.

సాయిబాబాకు ఘన నివాళి

ప్రజాశక్తి - మైలవరం : మానవ హక్కుల యోధుడు, ప్రజా కవి, మేధావి ప్రొఫెసర్ జి.ఎన్ సాయిబాబాకు సోమవారం మైలవరం బార్ అసోసియేషన్ న్యాయ వాదులు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ సాయిబాబాను ఉపా చట్టం కింద అరెస్టు చేసి 9 సంవత్సరాల పాటు బెయిల్ రాకుండా చేశారన్నారు. ఆరోగ్యం క్షీణిస్తున్న, తల్లి మరణించిన చివరిసారిగా చూడటానికి కూడా అవకాశం కల్పించలేదని ఇలాంటి సంఘటనలు మరలా జరక్కుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మైలవరం బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఏడి ప్రసాద్, వీటి కిషోర్, కమిటీ మానవ హక్కుల కన్వీనర్ రావూరి రమేష్ బాబు, న్యాయవాదులు ఎన్‌వికె సత్యనారాయణ, బుద్ధారపు వెంకటరావు, ఆంజనేయులు, శ్రీనివాసరావు, శరత్ బాబు, నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

పల్లెల్లో పండుగ వాతావరణం

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రాష్ట్ర వ్యాప్తంగా పల్లెల్లో పండగ వాతావరణం నెలకొందని మైలవరం ఎంఎల్ఏ వసంత వెంకటకృష్ణ ప్రసాద్ అన్నారు. రెడ్డిగూడెం మండలంలో ఎన్ఆర్‌జిఎస్ నిధులు రూ.5 కోట్లతో 10098 మీటర్ల సిమెంట్ రోడ్ల నిర్మాణానికి సోమవారం ఆయన పలు గ్రామాల్లో శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న పల్లెల్లో పండుగ వాతావరణం నెలకొందని, ప్రజలందరూ కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను అభినందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన మైలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జీ అక్కల రామ్మోహనరావు, టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి నాగేశ్వరరెడ్డి, విజయబాబు, ఎంపిపి రామినేని దేవిప్రవణ్య వీరస్వామి నాయుడు, పాలంకి మోహన మురళిరెడ్డి, ఎంపిడిఒ రమణ, ఆయా గ్రామాల సర్పంచులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పల్లెపండుగ

ప్రజాశక్తి - కంచికచర్ల : గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఏపి ప్రభుత్వం పల్లె పండుగ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని నందిగామ ఎంఎల్ఏ తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా కంచికచర్లలో చేపట్టిన అభివృద్ధి పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. పలుచోట్ల నిర్మించిన కల్వర్టులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యం ఎన్‌డిఎ సర్కార్‌తోనే సాధ్యమవుతుందన్నారు. ఒకే రోజు 13,326 పంచాయతీ గ్రామసభలు, అభివృద్ధి పనులకు తీర్మానాలు చేయడం చరిత్రాత్మకం అన్నారు. పల్లె పండుగలో రూ.4,500 కోట్లతో 30 వేల పనులు చేపడుతున్నామన్నారు. సంక్రాంతిలోపు గ్రామాల్లో 3 వేల కిలోమీటర్ల సిమెంట్ రోడ్లు పూర్తిచేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వేల్పుల సునీత, టిడిపి నాయకులు కోగంటి బాబు, ఎంపిటిసి ఉదయ్‌కిరణ్, ఎంపిడిఒ లక్ష్మీ కుమారి, ఎఇ రవి కుమార్, కార్యదర్శి బ్రహ్మం పాల్గొన్నారు.

'పల్లెపండుగ'లో సిసి రోడ్లకు శంకుస్థాపన

మొవ్వ మండలంలో పాల్గొన్న ఎంఎల్ఎ వర్ల కుమార్‌రాజా

గుడివాడ మండలంలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి-గుడివాడ : ప్రజలకు మెరుగైన పాలన అందించి వారికి మంచి చేసేందుకే ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం నందివాడ మండలంలో పల్లె పండగ కార్యక్రమంలో అధికారులతో కలిసి రావి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూ.30.25లక్షల నిధులతో నందివాడలో గ్రామంలో రూ.40లక్షలతో, తుమ్మలపల్లిలో రూ.45.01 లక్షల నిధులతో, లక్ష్మీ నరసింహ పురంగ్రామంలో రూ.25 లక్షల నిధులతో, కుదరవల్లి గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణ పనులకు మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, టిడిపి నేత వెనిగండ్ల రామకష్ణ (నాని) భూమి పూజ నిర్వహించి శంకుస్థాపన చేశారు. ఎండిఓ మల్లీశ్వరి,తాసిల్దార్ రఘురాంరెడ్డి, మండల టిడిపి అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మొవ్వ :** మొవ్వ మండలం కాజ గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. కాజ గ్రామపంచాయతీ పరిధిలో సుమారు 35లక్షల విలువగల పలు సీసీ రోడ్లకు పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వర్ల కుమార్ రాజా మాట్లాడుతూ పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఒక గ్రామంలో ప్రతిరోజు రాత్రి 9 గంటల తర్వాత పల్లె నిద్ర జరుగుతుందని, ఆ కార్యక్రమంలో పల్లెలోనే నిద్ర చేసి తర్వాత రోజు ఉదయాన్నే ప్రజలతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మొవ్వ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు లింగమనేని రామలింగేశ్వరరావు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** గ్రామాల్లో నూరు శాతం సిసి రోడ్ల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం కషి చేస్తుందని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ హామీ ఇచ్చారు. సోమవారం సాయంత్రం పంచాయతీ పరిధిలోని లంకమ్మ మాన్యంలో రూ 2.4 కోట్ల తో మంజూరైన 30 సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెపండుగ పంచాయతీ వారోత్సవాల సందర్భంగా నియోజకవర్గంలో రూ 30.68 కోట్లతో 48.730 కిలోమీటర్ల పొడవునా 496 సీసీ రోడ్లు నిర్మించనున్నట్లు చెప్పారు. అలాగే మండల పరిధిలోని అశ్వరావుపాలెంలో కూడా పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల కార్యక్రమంలో కూడా బుద్ధ ప్రసాద్ పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ గోరుముచ్చు ఉమా, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, జనసేన మండల పార్టీ అధ్యక్షులు గురువాక శేషుబాబు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడివాడరూరల్ :** గుడివాడ రూరల్ మండలంలో నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాము పాల్గొన్నారు. రూ.10 లక్షలతో గుంటాకోడూరు, రూ.40 లక్షల నిధులతో మోటూరు, రూ.29.75 లక్షల నిధులతో వలివర్తిపాడు గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే రాము శంకుస్థాపన చేశారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, గుడివాడ మండల టిడిపి అధ్యక్షుడు వాసే మురళి, టిడిపి నాయకులు గోర్జి సత్యనారాయణ, ముల్లపూడి రమేష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

అవనిగడ్డ మండలంలో పాల్గొన్న బుద్ధప్రసాద్

మత్తుపదార్థాల అనర్థాలపై అవగాహన చేపట్టాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : మత్తు పదార్థాల వ్యసనం నుండి యువతను కాపాడేందుకు అన్ని విధాల చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ నగరంలోని కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాస్థాయి నషాముక్త భారత్ అభియాన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యుల అభిప్రాయాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని పాఠశాలలు కళాశాలల్లో మత్తు పదార్థాల వలన కలిగే అనర్థాలపై యువతకు అవగాహన కార్యక్రమాలను ముమ్మరంగా చేపట్టాలన్నారు. కళాశాలల్లో విద్యార్థుల క్లబ్బులను ఏర్పాటు చేసి మత్తు పదార్థాల గురించి చర్చించి అవగాహనను వ్యాప్తి చేయాలన్నారు. మత్తు పదార్థాల బాధితులను గుర్తించి వారిని పునరావాస కేంద్రాలకు చేర్చి తగిన కౌన్సిలింగ్, వైద్య చికిత్స అందించాలన్నారు.అటవీ ప్రాంతాల్లో గంజాయి మొక్కల పెంపకాన్ని గుర్తించి అరికట్టాలన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు రవాణా చేస్తున్న వాహనాలను గుర్తించి కేసులు నమోదు చేయాలన్నారు. ఈ సందర్భంగా సైకాలజిస్ట్ డాక్టర్ శంకర్రావు రూపొందించిన " మత్తు పదార్థాలకు దూరంగా యువత " అనే పుస్తకాన్ని జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సమావేశంలో జిల్లా సీనియర్ సివిల్ జడ్జి కెవి రామకష్ణయ్య, అదనపు ఎస్పీ ఎస్విడి ప్రసాదు, జిల్లా వయోవద్ధులు దివ్యాంగుల శాఖ సహాయ సంచాలకులు కామరాజు డి సి హెచ్ ఎస్ డాక్టర్ శ్రావణ్ కుమార్, డిఎంహెచ్వో డాక్టర్ గీతాబాయి, ఐసిడిఎస్ పిడి సువర్ణ, జడ్పీసీఈవో కన్నమ నాయుడు, ఎల్డియం జయవర్ధన్, కౌన్సెలింగ్ సైకాలజిస్ట్ డాక్టర్ జి శంకర్రావు పాల్గొన్నారు.

ముగిసిన నవరాత్రులు

ప్రజాశక్తి-గుడివాడ : స్థానిక 9వ వార్డులోని పుల్లపాడు వంతెన సమీపంలో ఉన్న విజయ దుర్గమ్మ అమ్మవారి దేవస్థానలో నవరాత్రులు ముగిసిన సందర్భంగా అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, టిడిపి నాయకులు వసంతవాడ దుర్గారావు, పొగిరి రమణ, రమేష్, జనసేన నాయకులు మజ్జి శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

రూ.71 కోట్లతో అభివృద్ధి పనులు : మంత్రి

మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గంలో రూ.71 కోట్లతో వివిధ అభివద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్టు రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఆబ్కారీ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. సోమవారం ఆర్అండి అతిథి గహంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ఎన్ఆన్ఇజిఎస్ కింద మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో రూ.21 కోట్ల అభివద్ధి పనులు మంజూరయ్యాయని, వీటితో పాటు మరో పదిన్నర కోట్ల అభివద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. ఆర్అండ్ బి శాఖ కింద నియోజకవర్గంలో శిథిలమయిన రోడ్ల పనులు చేపడుతున్నామన్నారు. నియోజకవర్గంలో ప్రతి పంచాయతీకి 15వ ఆర్థిక సంఘ నిధులు మంజూరయ్యా యని, ఈ నిధులతో వివిధ గ్రామాల్లో రోడ్లు, శ్మశానాలు, ప్రహరీగోడల అభివద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. వీటితో పాటు రూ.20 కోట్లు మైనింగ్ గ్రాంటు తీసుకువచ్చామని, ఈ నిధులతో చేపట్టబోయే పనులకు ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. గతంలో మంత్రిగా పనిచేసిన పేర్ని నాని నియోజకవర్గానికి చేసిందేమీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, సీనియర్ టీడీపీ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్ కండిషనర్, కూలర్స్, రిఫ్రిజిరేటర్స్‌పై ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-విజయవాడ : అంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ, శ్రీ సత్యసాయి సేవా సంస్థలు ఆధ్వర్యంలో బ్యాంకర్ల గ్రామీణ ఔత్సాహికుల అభివద్ధి సంస్థ, హైదరాబాద్ బిరిడ్ వారి సహకారంతో వరద ముంపు ప్రాంత యువకుల ఆర్థిక అభ్యున్నతికి ఎయిర్ కండిషనర్, కూలర్స్, రిఫ్రిజిరేటర్స్ మెకానిజమ్‌పై ఉచిత వృత్తి విద్యా శిక్షణ విజయవాడలోని రాజీవ్‌నగర్‌లోని భారత వికాస్ పరిషత్ భవనంలో అతిత్వరలో ప్రారంభించునున్నట్లు ఎన్‌టిఆర్ జిల్లా నైపుణ్యాభివద్ధి అధికారి ఎస్. శ్రీనివాసరావు తెలిపారు. ఈ శిక్షణకు 10వ తరగతిలో పాస్ లేదా ఫెయిల్ అయిన 19 నుండి 30 సంవత్సరాల యువకులు అర్హులన్నారు., శిక్షణ కాలవ్యవధి 37 రోజులనీ, శిక్షణా తరగతులు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. శిక్షణా కాలంలో ఉచిత మధ్యాహ్న భోజనం సదుపాయం ఉంటుందని, అలాగే శిక్షణా కాలంలో వర్కింగ్ మెటీరియల్ ఉచితంగా ఇస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికేట్ ఇస్తామని, సర్టిఫికేట్ పొందిన యువకులకు ప్రఖ్యాత ఎల్.జి . కారియర్ , బ్లూ స్టార్ , డియాకిన్ కంపెనీలలో క్యాంపస్ ప్లేస్మెంట్కు అవకాశం ఉంటుందన్నారు. ఈ ఉచిత శిక్షణలో 40 మంది యువకులకు మాత్రమే అవకాశము కల్పించబడునని, ఇటీవల వచ్చిన వరద ముంపు ప్రాంతాలలో నివాసం ఉంటున్నవారికి మొదట ప్రాధాన్యత ఉంటుందనీ తెలిపారు. కావున, తగిన అర్హతలు కలిగి ఉపాధికై ఎదురు చూస్తున్న యువకులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 99512 84459, 78934 16244, 9032840287 సంప్రదించవచ్చున్నారు.

వికలాంగుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో వికలాంగుల సంక్షేమం కోసం తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ జిల్లా స్థాయి దివ్యాంగుల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగుల సమస్యలు వారి అభిప్రాయాలను కమిటీలోని సభ్యులను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులను చిన్న చూపు చూడకుండా వారిలో మనోధైర్యం పెంపొందించి జీవితంలో ఉన్నత స్థానం చేరుకునేందుకు ప్రోత్సహించాలన్నారు. వారికి కావలసిన వైద్య సహాయం ఎప్పటికప్పుడు అందించాలన్నారు. ప్రతి సోమవారం కలెక్టరేట్లో నిర్వహించి మీకోసం కార్యక్రమంలో దివ్యాంగుల కోసం ప్రత్యేక ప్రవేశ మార్గం ఏర్పాటు చేసి త్వరగా అర్జీలు తీసుకునే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో జిల్లా సీనియర్ సివిల్ జడ్జి కెవి రామకష్ణయ్య, అదనపు ఎస్పీ ఎస్ వి డి ప్రసాద్, జిల్లా వయోవద్ధులు దివ్యాంగుల శాఖ సహాయ సంచాలకులు కామరాజు డి సి హెచ్ ఎస్ డాక్టర్ శ్రావణ్ కుమార్, డి ఎం హెచ్ ఓ డాక్టర్ గీతాబాయి తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందిస్తున్న నాయకులు

డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-ఉంగుటూరు : డ్రైనేజీ సమస్యకు పరిష్కారం చూపాలని ఉంగుటూరు ఎంపిడివో సత్యకుమార్‌కు సిపిఎం ఆధ్వర్యంలో లంకపల్లి అగ్రహారం గ్రామ ప్రజలు వినతిపత్రం సోమవారం అందించారు. మండలంలోని లంకపల్లి అగ్రహారంలోని ఎస్సీ, బిసీ కాలనీల్లో కొద్దిపాటి వర్షం పడిన రోడ్లు మీద మురుగు నీరు ప్రవహిస్తోందని, నడవడానికి అవకాశం లేకుండా దుర్గంధాన్ని వెదజల్లుతుందని ఫలితంగా దోమలు విజృంభిస్తున్నాయన్నారు. వీటి కారణంగా కాలనీల్లో అత్యధిక మంది అనారోగ్యాలకు గురవుతున్నామని, తక్షణమే డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టివి లక్ష్మణస్వామి, పార్టీ మండల కార్యదర్శి అజ్మీరా వెంకటేశ్వరరావు, గుండె కుమారి, కళ్ళెం జయరాజు, చింతగుంట మరియమ్మ, పద్మజ పాల్గొన్నారు.

'మీకోసం'లో 40 ఫిర్యాదులు

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ప్రజా ఫిర్యాదుల సత్వర పరిష్కారమే లక్ష్యంగా 'మీకోసం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కార్యక్రమం 'మీకోసం' నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ప్రజలు వారు ఎదుర్కొంటున్న ఎలాంటి సమస్యనైనా పోలీస్ శాఖ దృష్టికి తీసుకువస్తే విచారణ నిర్వహించి చట్ట పరిధిలో పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. మొత్తం 40 మంది తమ ఫిర్యాదులను అర్జీ రూపంలో అందించారని తెలిపారు. వచ్చిన ఫిర్యాదులను పై సంబందిత పోలీస్ స్టేషన్ అధికారులతో మాట్లాడి చట్టప్రకారం నిర్దేశించిన గడువులోగా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు.

సమస్యలు వింటున్న ఎస్పీ

విజయవాడలో పొట్టేల్ చిత్ర బృందం సందడి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : అక్టోబర్ 25న తెలుగు రాష్ట్రాల్లో విడుదల కానున్న పొట్టేల్ చిత్రం ప్రమోషన్‌లో భాగంగా చిత్ర యూనిట్ విజయవాడ నగరంలో సందడి చేసింది. ఈ సందర్భంగా బందరు రోడ్డు లోని సోల్ ఆఫ్ సౌత్ హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హీరోయిన్ అనన్య నాగళ్ళ మాట్లాడారు. పొట్టేల్ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించి విజయవంతం చేయాలని అనన్య నాగళ్ళ కోరారు. తెలంగాణ నేపథ్యంలో సాగే ఈ చిత్రం ప్రేక్షకులను కచ్చితంగా ఆకట్టుకుంటుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు తాను చేసిన చిత్రాల కంటే భిన్నంగా ఈ చిత్రం ఉంటుందని చెప్పారు. ఈ చిత్రానికి పొట్టేల్ అనే పేరు పెట్టడం వెనక చిత్రకథ ఎంతో ఆసక్తిగా ఉంటుందన్నారు. పొట్టేల్ చిత్రానికి సంబంధించి ఇప్పటికే విడుదలైన టీజర్ ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. పాటలు కూడా ప్రేక్షకులకును ఆకట్టుకునేలా ఉన్నాయన్నారు. ఈ చిత్రంలో సీనియర్ నటుడు అజయ్ పాత్ర ప్రేక్షకులను కట్టిపడేసేలా ఉంటుందని తెలిపారు. ఈ చిత్రంలో అనేకమంది సీనియర్ నటులు నటిస్తున్నారని అక్టోబర్ 25న విడుదలయ్యే ఈ చిత్రాన్ని ప్రేక్షకులు కచ్చితంగా థియేటర్లలోనే చూడాలని ఆమె కోరారు. చిన్న చిత్రాన్ని విజయంతం చేసి తమలాంటి వారిని ప్రోత్సహించాలని ప్రేక్షకులకు విజ్ఞప్తి చేశారు. అనంతరం హీరో యువన్ కృష్ణ మాట్లాడుతూ దర్శకుడు సాహిత్ మొతుకూరి చెప్పిన కథ నచ్చి వెంటనే పొట్టేలు చిత్రంలో హీరోగా నటించడం జరిగిందన్నారు. తెలంగాణ నేపథ్యంలో సాగే ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను కచ్చితంగా ఆకట్టుకుంటుందని ఆయన తెలిపారు. ఈ చిత్రంలోని సన్నివేశాలు ప్రేక్షకులను హద్దుకునేలా ఉంటాయన్నారు. ప్రేక్షకులు ఈ చిత్రాన్ని వీక్షించి విజయవంతం చేయాలని కోరారు. అనంతరం నటుడు నోయల్ మాట్లాడుతూ ఈ చిత్రంలో తన క్యారెక్టర్ ప్రేక్షకులకు అమితంగా నచ్చుతుందని తెలిపారు. అక్టోబర్ 25న ఈ చిత్రం విడుదల కానుందని ప్రేక్షకులు చిత్రాన్ని వీక్షించాలన్నారు. విలేకరుల సమావేశంలో చిత్ర సహనిర్మాత నిశాంక్ రెడ్డి పాల్గొన్నారు.

మద్యం షాపుల లాటరీ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలో నాలుగు షాపులకు గానూ, షాపు నెం 88లో గాలిబ్ సైదా (షేర్‌మహ్మద్ పేట), 89లో గారేపల్లి కాంతారావు (తెలంగాణ మరిపాడా), 90లో వేదా సత్యనారాయణ అలియాస్ గోపి (జగ్గయ్యపేట), 91లో షేక్ మహ్మద్ రఫీ (చిల్లకల్లు), జగ్గయ్యపేట మండలంలో నాలుగు షాపులకు గాను షాపు నెం 92లో హిమబిందు (తెలంగాణ మునగాల), 93లో బింగి లక్ష్మీనారాయణ (షేర్ మహ్మద్ పేట), 94 లో తుమ్మేపల్లి శ్రీరాం చంద్ర గుప్తా (జగ్గయ్యపేట), 95లో 53 అడుసుమిల్లి నరసింహారావు (బండిపాలెం) వత్సవాయి మండలంలో రెండు షాపుల గానూ షాపు నెం 96లో చెరుకుపల్లి సత్యనారాయణ (తెలంగాణ ఖమ్మం ఖానాపూరం), 97లో బండి అనూషా (తెలంగాణ సూర్యపేట జిల్లా) లు ప్రభుత్వ మద్యం షాపులను లాటరీ పద్ధతిలో దక్కించుకున్నారు.

లాటరీ తీస్తున్న దృశ్యం

ఆర్‌యు లోన్స్ విస్తరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రముఖ ఆర్థిక ఉత్పత్తుల పంపిణీ సంస్థ ఆర్ యూ లోన్స్ డిస్ట్రిబ్యూషన్ సర్వీసెస్, విజయవాడలో రుణ పంపిణీ వ్యాపారాన్ని విస్తరించనున్నట్లు సంస్థ ప్రతినిధి కె.సునీల్ కుమార్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. దేశవ్యాప్తంగా 4,000 నగరాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఆర్ యూ లోన్స్ ఇప్పటికే విజయవాడలో తన కార్యకలాపాలను ప్రారంభించిందన్నారు.. ఈ సంస్థ గృహ రుణాలు, వాహన రుణాలు, వ్యాపార రుణాలు, తనఖా రుణాలు, పునరుత్పాదక ఇంధన రుణాలు వ్యక్తిగత రుణాలు వంటి అనేక ఉత్పత్తులను అందజేస్తూ నగరంలో పట్టు సాధించేందుకు ప్రయత్నిస్తోంది అని తెలిపారు.. 275 పబ్లిక్ సెక్టార్ బ్యాంక్లు (పిఎస్‌బి), ప్రైవేట్ బ్యాంకుల బలమైన నెట్‌వర్క్‌ను కలిగి ఉన్న సంస్థ, ఇప్పుడు రాష్ట్రంలో గృహ రుణాల కోసం పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా పని చేస్తుంది అని తెలిపారు.



ఎంఎల్‌సి ఓటు నమోదు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కృష్ణ గుంటూరు జిల్లాలో పట్టభద్రుల నియోజకవర్గానికి మార్చిలో జరగబోవు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ నమోదు కేంద్రం కోసం నమోదు కేంద్రాన్ని యుటిఎఫ్ రాష్ట్ర కార్యాలయం విజయవాడలో ప్రారంభించినట్టు యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, సుందరయ్య తెలిపారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు చేతుల మీదుగా మొదటి ఓటు నమోదు కార్యక్రమాన్ని జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఓటు నమోదు చేసుకోవాలనుకునేవారు యుటిఎఫ్ కార్యాలయంలో సంప్రదించి డిగ్రీ సర్టిఫికెట్, ఓటర్ ఐడి ఇచ్చి నమోదు చేసుకోవాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మనోహర్ కుమార్ ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం హనుమంతరావు, జిల్లా కోశాధికారి పి.నాగేశ్వరరావు , ఎ.గోపాలకృష్ణ మల్లికార్జున్ రెడ్డి, ఎం.శ్రీనివాసరావు, వెంకటరమణ, జానకి చలపతిరావు, బి.రమేష్, రత్నకమల్, విజయ ప్రకాష్, సోమేశ్వరరావు, జె.వి.వి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఆర్ కళాశాల స్థలాన్ని కాపాడాలి

ప్లకార్డులతో నినాదాలు చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - విజయవాడ : ఆక్రమణల చెరలో ఉన్న నగరంలోని ప్రసిద్ధి చెందిన ఎస్ఆర్ఆర్ అండ్ సివిఆర్ ప్రభుత్వ కళాశాల స్థలాన్ని ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకొని కాపాడాలని కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు దోనేపూడి కాశీనాథ్ డిమాండ్ చేశారు. కళాశాలకి చెందిన స్థలం ఆక్రమణకు గురవుతున్న నేపథ్యంలో స్థానిక బిఆర్‌టిఎస్ రోడ్డు గులాబితోట వద్ద కాలేజీ స్థలాన్ని పూర్వ విద్యార్థుల సంఘం నేతలు సోమవారం పరిశీలించారు. ప్లకార్డులు చేబూని నేతలు నినాదాలు చేశారు. కళాశాల స్థలాన్ని కాపాడాలని, భూకబ్జాకోరుల ఆగడాలను నిలువరించాలి, విఎంసి జోక్యం చేసుకోవాలని నాయకులు నినాదాలు చేశారు. కాశీనాథ్ మాట్లాడుతూ ఎస్ఆర్ఆర్ కళాశాలకు చెందిన రూ.300కోట్లు విలువ చేసే 6.67 ఎకరాల స్థలం కబ్జాకి గురవుతున్నా కళాశాల యాజమాన్యం, ప్రభుత్వాలు, విజయవాడ నగరపాలక సంస్థ పట్టించుకోవటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.దసరా పండుగ సందర్భంగా కొంత మంది ప్రైవేటు వ్యక్తులు కళాశాల స్థలంలో శంకుస్థాపనకు సిద్ధం అవుతున్న తరుణంలో ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన దృష్టికి తీసుకెళ్లగా వెంటనే తహశీల్దార్‌ని స్థల పరిశీలన చేయటానికి పంపి జరుగుతున్న పనులను నిలుపుదల చేశారని చెప్పారు. ఆపరేషన్ బుడమేరు చేపడతామని ప్రభుత్వం ప్రకటించటాన్ని స్వాగతిస్తూ అలాగే ఆపరేషన్ ఎస్ఆర్ఆర్‌ని నిర్వహించి అక్రమణదారుల నుంచి కళాశాల స్థలాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావుకు జోక్యం చేసుకోవాలని కోరారు. దాదాపు 87 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర ఉన్న శ్రీ రాజారంగయ్యప్పారావు అండ్ చుండూరు వెంకట రెడ్డి (ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్) ప్రభుత్వ కళాశాల స్థలాన్ని కాపాడటంలో ప్రజలు, విద్యార్థులు స్పందించాలని కోరారు. పూర్వ విద్యార్థుల సంఘం నేతలు దోనేపూడి శంకర్, చెరుకూరి కష్ణ కుమార్, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు లంకా జానయ్య, కార్యదర్శి చిగురుపాటి యుగంధర్‌లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు ఆళ్ల వేణుగోపాలరావు, నల్లమోతు వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్

ప్రజాశక్తి - విసన్నపేట : విస్సన్నపేట మండలం తాతకుంట్ల మిట్టగూడెం గ్రామంలో బతుకమ్మ గొంతెమ్మ పండుగ సంబరాల్లో భాగంగా గత 35 సంవత్సరాల నుండి నిర్విరామంగా అనేక సాంఘిక, సాంస్కృతిక కార్యక్రమాలు, జానపద కళలు భజనలు, కోలాటాలు నిర్వహిస్తున్న మిట్టగూడెం అంబేద్కర్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఆంధ్ర తెలంగాణ రెండు రాష్ట్రాల పరిధిలో కబడ్డీ చెడుగుడు వాలీబాల్ మొదలగు టోర్నమెంట్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం కూడా వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్లో మొదటి బహుమతిగా రూ.30వేలు, రెండో బహుమతిగా రూ.20వేలు మూడో బహుమతిగా రూ.15వేలు, బహుమతిగా ఇచ్చారు.

విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న దృశ్యం

వాలీబాల్ ఆడుతున్న దృశ్యం

బిర్లా ఓపస్ పెయింట్స్ క్యాంపెయిన్ ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఆదిత్య బిర్లా గ్రూప్ గ్రాసిమ్ ఇండస్ట్రీస్‌లో భాగమైన బిర్లా ఓపస్ పెయింట్స్ ఇప్పుడు తన తాజా క్యాంపెయిన్ 'నయే జమానే కా నయా పెయింట్' అంటే 'కొత్త యుగానికి కొత్త పెయింట్'ను ప్రారంభించినట్లు సంస్థ ఇంఛార్జి ఎస్ .ప్రతాప్ ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త పెయింట్‌ను ప్రతి ఒక్కరికే చేరువ చేయాలనే ఉద్దేశంతోనే నూతన ప్రచారానికి శ్రీకారం చుట్టిన తెలిపారు. ప్రముఖ నటులు విక్కీ కౌశల్, రష్మిక మందన్న, బ్రాండ్ అంబాసిడర్‌లుగా తన ప్రత్యేక, విలక్షణమైన లక్షణాలు, నాణ్యత గురించి ఈ ప్రచారంలో మాట్లాడతారు అని తెలిపారు.

వాహనాలు తనిఖీ

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ సిఐ వైవిఎల్ నాయుడు ఆదేశాల మేరకు ఎస్ఐ శాతకర్ణి పట్టణంలోని గాంధీ సెంటర్లో వాహనాలు తనిఖీలు చేపట్టారు. లైసెన్స్ లేనివారికి నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపే సెల్ఫోన్ డ్రైవింగ్ చేస్తూ వాహనాలు నడిపే వారికి జరిమానా విధించారు. ద్విచక్ర వాహనాలు నడుపుతున్న మైనర్ల వాహనాలు నిలుపుదల చేసి వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. మొదటి తప్పుగా జరిమానా విధించి వదిలేస్తున్నామని మరోసారి మైనర్లకు వాహనాలు ఇస్తే ద్విచక్ర వాహనాలు సీజ్ చేస్తామని ఎస్ఐ తెలిపారు.

దుర్గమ్మను దర్శించుకున్న కేంద్ర మంత్రి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం డిఫెన్స్ ఆర్ అండ్ డి మాజీ కార్యదర్శి చైర్మన్, డిఆర్‌డిఒ, కేంద్ర రక్షణ మంత్రి సాంకేతిక సలహాదారు డాక్టర్ సతీష్ రెడ్డి అమ్మవారి దర్శనార్థం సోమవారం ఆలయానికి విచ్చేశారు. ఆలయ ఇఒ కెఎస్ రామారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం ఆలయ వేదపండితులు వీరికి వేదార్వచనం చేయగా ఈవో అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.